


# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక | ప్రశ్నించడం మన హక్కు




సంపుటి : 9 సంచిక : 189 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : కాకినాడ ఆదివారం 15 మార్చి 2026 వెల : 1/-రూ ॥

VOLUME :9 ISSUE : 189 PAGES :8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : KAKINADA SUN 15 MARCH 2026 PRICE : 1/- RS

Simultaneously Published form Kakinada,Ongole,Visakhapatnam,Bapatla,Narasarao Peta, YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur

# యుద్ధం వేళ.. ప్రజల్లో భయం పుట్టిస్తున్నారు



## కాంగ్రెస్‌పై మోదీ ధ్వజం

**పెన్ పవర్ డెస్క్:**పశ్చిమాసియాలో ఉద్రిక్తతల ప్రభావం మనపై ఉందని, ఒక విధంగా యుద్ధం లాంటి పరిస్థితి కనిపిస్తోందని, ఇలాంటి తరుణంలో ప్రజలు ఎలాంటి ఇబ్బందులకు గురికాకుండా కేంద్ర ప్రభుత్వం సమర్థవంతంగా ముందుకు సాగుతోందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ అన్నారు. కానీ కాంగ్రెస్ పార్టీ దేశంలో, ప్రజల్లో భయాందోళనలు సృష్టించే ప్రయత్నం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ బాధ్యతారాహిత్యంతో వ్యవహరిస్తోందని విమర్శించారు. అసోంలోని సిల్చార్‌లో ప్రధానమంత్రి


- మిగతా2లో

## రెండు ఎల్పీజీ నౌకలు హోర్ముజ్‌ను దాటాయి...

# వంటగ్యాస్‌కు ఇబ్బంది లేదు

**పెన్ పవర్ డెస్క్:**భారతదేశ జెండాలు కలిగిన రెండు ఎల్పీజీ నౌకలు శనివారం సురక్షితంగా హోర్ముజ్ జలసంధిని దాటాయని కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. ఇరాన్, అమెరికా-ఇజ్రాయెల్ యుద్ధం నేపథ్యంలో ఈ జలసంధిని ఇరాన్ మూసివేసిన విషయం తెలిసిందే. దీనితో హోర్ముజ్‌కు ఇరువైపుల వందలాది నౌకలు నిలిచిపోయాయి. భారత ప్రభుత్వం సంప్రదింపుల నేపథ్యంలో, భారత జెండాలు కలిగిన నౌకలు వెళ్లడానికి ఇరాన్ అంగీకరించింది. ఈ క్రమంలో రెండు నౌకలు హోర్ముజ్‌ను దాటాయి. శివాలిక్, నందాదేవి పేరు గల నౌకలు గుజరాత్‌లోని ముంద్రా, కాండ్లా పోర్టుల వైపు వస్తున్నాయని షిప్పింగ్ మంత్రిత్వ

- మిగతా7లో





## 2011 నాటి ఫొటోతో గ్యాస్ పై కాంగ్రెస్ తప్పుడు ప్రచారం చేస్తోంది

**పెన్ పవర్ డెస్క్:**ఇరాన్ సంక్షోభం నేపథ్యంలో ఇంధన కొరతపై కాంగ్రెస్ పార్టీ అనవసర భయాందోళనలు సృష్టిస్తోందని కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు తీవ్రంగా విమర్శించారు. పాత ఫోటోలను అడ్డుపెట్టుకుని ప్రజలను తప్పుదోవ పట్టించేలా తప్పుడు ప్రచారం చేస్తోందని

- మిగతా2లో



## యూఏఈలో అతిపెద్ద టెర్మినల్‌పై ఇరాన్ డ్రోన్ దాడి

**పెన్ పవర్ డెస్క్:**యునైటెడ్ అరబిక్ ఎమిరేట్స్ (యూఏ ఈ)లో అతిపెద్ద ఇంధన నిల్వల కేంద్రమైన పుజైరా ఓడరేవుపై ఇరాన్ డ్రోన్‌లతో దాడి చేసింది. దీంతో ఇక్కడ తీవ్ర

- మిగతా2లో

# మాది పీపుల్ ఫ్రెండ్లీ ప్రభుత్వం

## ప్రజల కోసం ఎక్కడికైనా వస్తా: పవన్ కల్యాణ్

- ప్రజా సమస్యల పరిష్కరానికి నిబద్ధతతో పని చేస్తాం... అభివృద్ధి చేసి చూపిస్తాం
- గత ప్రభుత్వం నిధుల మళ్లింపే ఏజెన్సీ వెనుకబాటుకు కారణం
- గిరిశిఖర గ్రామాల్లో 18 నెలల్లో 460 కిలోమీటర్ల మేర రోడ్లు
- జలజీవన్ మిషన్ ద్వారా రక్షిత మంచి నీరు అందిస్తాం
- నందిగరువు 'మాట - మంతి' కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్

**పెన్ పవర్ డెస్క్:**తమది 'పీపుల్ ఫ్రెండ్లీ ప్రభుత్వం' అని, ప్రజా సమస్యల పరిష్కారానికి నిబద్ధతతో పనిచేస్తామని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. జనసేన పార్టీ 13వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం ఆయన అల్లూరి సీతారామరాజు జిల్లా, పాడేరు నియోజకవర్గంలోని మారుమూల గిరిజన గ్రామం నందిగరువులో పర్యటించారు. ఈ సందర్భంగా గిరిజనులతో 'మాట-మంతి' కార్యక్రమం నిర్వహించి, వారి సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ మాట్లాడుతూ.. "గత ప్రభుత్వంలో కనీసం సమస్యలు చెప్పుకోవడానికి కూడా ప్రజలు





# మంత్రి లోకేశ్ ఇంట సంబరాలు

## ఘనంగా దేవాన్ష్ పంచెకట్టు వేడుక...



**పెన్ పవర్ డెస్క్:**ఏపీ మంత్రి నారా లోకేశ్ ఇంట్లో పండుగ వాతావరణం నెలకొంది. ఆయన కుమారుడు నారా దేవాన్ష్ పంచెకట్టు (ధోతీ) వేడుకను శనివారం కుటుంబ సభ్యులు, సన్నిహితుల సమక్షంలో ఘనంగా నిర్వహించారు. ఈ సంతోషకరమైన విషయాన్ని లోకేశ్ స్వయంగా సోషల్ మీడియా ద్వారా పంచుకున్నారు. తన కుమారుడు భారతీయ సంప్రదాయాలను స్వీకరించడం చూసి గర్వపడుతున్నానని ఆయన ఆనందం వ్యక్తం చేశారు.

ఈ వేడుకకు సంబంధించిన ఫోటోలను కూడా లోకేశ్ పంచుకున్నారు. "ఈ రోజు మా కుటుంబ సభ్యులు, సన్నిహిత బంధువులు అందరం కలిసి దేవాన్ష్ ధోతీ వేడుకను జరుపుకున్నాం. దేవాన్ష్ పెరిగి పెద్దవాడవుతూ మన సంప్రదాయాలను ఇంత మధురమైన రీతిలో స్వీకరించడం చూడటం మా అందరికీ గర్వకారణం. ఈ ప్రత్యేకమైన ఘట్టం నేపథ్యంలో, దేవాన్ష్‌కు జీవితాంతం సంతోషం, విజయం కలగాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను" అని లోకేశ్ తన పోస్టులో పేర్కొన్నారు. ఈ వేడుకలో దేవాన్ష్ పంచెకట్టులో సంప్రదాయబద్ధంగా కనిపించాడు. లోకేశ్ పంచుకున్న ఫోటోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. పలువురు ప్రముఖులు, అభిమానులు దేవాన్ష్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్నారు. ఇక, ఈ విశిష్ట వేడుకకు సీఎం చంద్రబాబు, నారా భువనేశ్వరి దంపతులు

- మిగతా2లో

# అమరావతి గ్రామాల్లో సౌకర్యాలపై మంత్రి నారాయణ కీలక ప్రకటన



**పెన్ పవర్ డెస్క్:** ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి నిర్మాణంలో భాగంగా రాజధాని గ్రామాలను అంతర్జాతీయ ప్రమాణాలతో అభివృద్ధి చేస్తామని పురపాలక శాఖ మంత్రి నారాయణ ప్రకటించారు.


అమరావతి పరిధిలోని అనంతవరం, నెక్కల్లు గ్రామాల్లో స్థానిక ఎమ్మెల్యే శ్రవణ్ కుమార్, సీఆర్డీఏ అధికారులతో కలిసి ఈరోజు నిర్వహించిన గ్రామసభల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామస్థుల నుంచి సమస్యలను అడిగి తెలుసుకున్న మంత్రి, మౌలిక సదుపాయాల కల్పనపై స్పష్టమైన హామీ ఇచ్చారు. రాజధాని మాస్టర్ ప్లాన్‌లో భాగంగా గ్రామ కంఠాల బయట ఏ తరహా అత్యాధునిక సౌకర్యాలు ఉంటాయో, గ్రామాల్లో కూడా అదే స్థాయిలో అభివృద్ధి చేస్తామని మంత్రి వివరించారు. ముఖ్యంగా అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, స్టార్మ్ వాటర్ వ్యవస్థ, ఎల్ఈడీ వీధి దీపాలు, నాణ్యమైన సిమెంట్ రోడ్ల నిర్మాణం చేపడతామని... పనులు ప్రారంభించిన


- మిగతా2లో

# గ్యాస్ సరఫరా, వినియోగంపై పయ్యావుల కేశవ్ కీలక వ్యాఖ్యలు

**పెన్ పవర్ డెస్క్:**ఆంధ్రప్రదేశ్ ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ రాష్ట్రంలో గ్యాస్ సరఫరా, వినియోగానికి సంబంధించి కీలక వ్యాఖ్యలు చేశారు. గ్యాస్ సిలిండర్ల బుకింగ్ ఇకపై తప్పనిసరిగా ఆన్‌లైన్ ద్వారానే జరగాలని, దీనివల్ల బ్లాక్ మార్కెటింగ్‌ను సమర్థవంతంగా అరికట్టవచ్చని ఆయన స్పష్టం చేశారు. ఇప్పటికే 88 శాతం మంది వినియోగదారులు ఓటీపీ ద్వారా సిలిండర్లు తీసుకుంటున్నారని, ఎవరైనా అక్రమాలకు పాల్పడితే ప్రభుత్వం, గ్యాస్ కంపెనీలు కఠిన చర్యలు తీసుకుంటాయని హెచ్చరించారు. గ్యాస్ దుర్వినియోగాన్ని అరికట్టేందుకు పట్టణ ప్రాంతాల్లో 25 రోజులు, గ్రామీణ

- మిగతా2లో





## తెలంగాణ రాష్ట్రంలో ఆల్‌టైమ్ గరిష్ఠానికి విద్యుత్ వినియోగం

**పెన్ పవర్ డెస్క్:**తెలంగాణ రాష్ట్రంలో విద్యుత్ వినియోగం రికార్డు స్థాయికి చేరుకుంది. రాష్ట్రంలో ఈ నెల 13వ తేదీన 341 మిలియన్ యూనిట్ల విద్యుత్ వినియోగం జరిగింది. దీనితో తెలంగాణలో వినియోగం ఆల్ టైమ్ గరిష్ఠానికి చేరుకుంది. వేసవి కాలంలో ఉష్ణోగ్రతలు అధికం కావడం, వ్యవసాయ రంగానికి విద్యుత్ వినియోగం పెరగడంతో రాష్ట్రంలో

- మిగతా2లో

# త్వరలో భారత్‌కు వస్తా

## మోదీపై మరోసారి ప్రేమ కురిపించిన ట్రంప్..



**పెన్ పవర్ డెస్క్:**భారత ప్రధాని నరేంద్ర మోదీపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి తన అభిమానాన్ని చాటుకున్నారు. భారత్, భారత ప్రజల పట్ల తనకున్న ప్రేమను వ్యక్తం చేస్తూ, త్వరలోనే దేశంలో పర్యటించే అవకాశం ఉందని సూచనప్రాయంగా తెలిపారు. ఇవాళ జరిగిన ఇండియా టుడే కాన్‌క్లేవ్ 2026 సదస్సులో

- మిగతా2లో

పెన్ పవర్

ఆదివారం 15 మార్చి 2026

ఎడిటర్ వ్యూ

## వినియోగదారుల హక్కుల పట్ల అవగాహన కల్పించలేమా !

వ్యాపార వాణిజ్యాలకు కేంద్ర బిందువు ఏకైక వినియోగదారుడు మాత్రమే. వినియోగదారులకు స్పష్టమైన హక్కులు, బాధ్యతలు ఉంటాయి. అనైతిక అన్యాయమైనా వస్తు సేవలు, అక్రమ వ్యాపార పద్ధతులతో వినియోగదారుడు నష్టపోవడంతో అనాదిగా కొనసాగుతున్నది. వినియోగదారులకు జరుగుతున్న అన్యాయాలు, అక్రమాలు, సమస్యల పట్ల తొలిసారి 15 మార్చి 1962న అమెరికాలో నాటి అధ్యక్షుడు జాన్ ఎఫ్ కెన్నెడీ మాట్లాడుతూ ప్రతి వినియోగదారుడికి కొన్ని స్పష్టమైన హక్కులు ఉండాలని ఆకాంక్షించారు. ఈ ఉపన్యాసాన్ని ప్రేరణగా తీసుకొని ప్రపంచ మానవాళి ప్రతి ఏట 15 మార్చిన "ప్రపంచ వినియోగదారుల హక్కుల దినం (వరల్డ్ కన్స్యూమర్ రైట్స్ డే)"ను పాటించుట 1983 నుంచి ఆనవాయితీగా మారింది. వినియోగదారుల హక్కుల ప్రాధాన్యం, నిజాయితీగా వ్యాపార పద్ధతులు పాటించడం, వినియోగదారుల చట్టాల పరిజ్ఞానం, వస్తు నాణ్యత - సేవలు, వ్యాపార ఆచరణలు, సుస్థిర జీవనశైలి దిశగా వినియోగదారులు మారడం, వినియోగదారుల రక్షణ చర్యలు లాంటి అంశాలను ప్రచారం చేయడానికి ఈ వేదికలను వినియోగించుకోవడం గత నాలుగు దశాబ్దాలకు పైగా కొనసాగుతున్నది. 2025 ప్రపంచ వినియోగదారుల హక్కుల దినం - 2026 ఇతివృత్తంగా "సురక్షిత ఉత్పత్తులు, నమ్మకంతో కూడిన వినియోగదారులు" అనే అంశాన్ని తీసుకొని ఆరోగ్యకర జీవనశైలి వైపు వినియోగదారుల దృష్టి కోణం మారడం, అందరికీ అందుబాటులోకి తేవడం లాంటివి జరగాలి. భారత వినియోగదారుల హక్కుల పరిరక్షణ చట్టాల ద్వారా భద్రత హక్కు, సమాచార హక్కు, ఎంపిక హక్కు, అభిప్రాయాలను వినిపించే హక్కు, పరిష్కార హక్కు, వినియోగదారుల విద్య హక్కు లాంటివి కల్పించబడినవి. కల్తీలు, చీకటి వ్యాపారాలు వినియోగదారులకు శాపాలుగా మారుతున్నాయి. భారత్‌లో 24 డిసెంబర్‌న "జాతీయ వినియోగదారుల దినం" జరుపుకోవడం జరుగుతోంది. వినియోగదారులకు అన్యాయాలకు, వస్తు సేవల లోపాలకు గురైనపుడు కోర్టులను లేదా ఫోరమ్‌లను ఆశ్రయించి న్యాయం పొందడమే కాకుండా అక్రమ వ్యాపారులకు శిక్షలు పడడానికి కూడా వెసులుబాటు కల్పించారు. వస్తు విలువలను బట్టి జాతీయ, రాష్ట్ర, జిల్లా స్థాయి వినియోగదారుల కోర్టుల్లో పరిష్కారాలు అందుతున్నాయి. వినియోగదారులు హక్కులను అనుభవిస్తూనే తమ బాధ్యతలను కూడా మరువకుండా చట్టాలను గౌరవిస్తూ సమాజాభివృద్ధికి కృషి చేయాలి. వినియోగదారుల విద్య పట్ల అవగాహన పెంచుకొని నైతిక విలువలతో ప్రవర్తిస్తూ వ్యాపారుల అనైతిక చర్యలకు స్పందిస్తూ ముందుకు సాగాలి. వ్యాపార సంస్థలు, వినియోగదారుల మధ్య సద్భావనలు, నమ్మకాలు, నీతి నిజాయితీలు, జవాబుదారీతనం లాంటి అంశాల్లో సరైన సంబంధాలు కలిగి ఉండాలి.

# రెండు ఎల్పీజీ నౌకలు హోర్ముజ్‌ను దాటాయి...
# వంటగ్యాస్‌కు ఇబ్బంది లేదు

- మొదటి పేజి తరువాయి

శాఖ ప్రత్యేక కార్యదర్శి రాజేశ్ కుమార్ సిన్హా తెలిపారు. ఈ నౌకల్లో సుమారు 92 వేల టన్నుల ఎల్పీజీ ఉందని, మార్చి 16 లేదా 17వ తేదీన ఇవి భారత్‌కు చేరుకునే అవకాశం ఉందని వెల్లడించారు.

**వంట గ్యాస్ విషయంలో ఇబ్బంది లేదు**

గృహ వినియోగదారులకు వంట గ్యాస్ విషయంలో ఎలాంటి ఇబ్బంది లేదని కేంద్రం హామీ ఇచ్చింది. ప్రజలు ఎవరూ ఆందోళన చెందవద్దని సూచించింది. అవసరం లేకున్నా చాలామంది ఆందోళనతో బుకింగ్ చేస్తున్నారని, అలాంటి చర్యలకు దూరంగా ఉండాలని కోరింది. బ్లాక్ మార్కెట్‌ను అరికట్టాలని రాష్ట్రాలని కోరినట్లు కేంద్రం తెలిపింది. ఆకస్మిక తనిఖీలు కూడా నిర్వహిస్తున్నట్లు వెల్లడించింది.

వాణిజ్య సిలిండర్ల కొరతపై కూడా కేంద్రం స్పందించింది. ప్రాధాన్యత క్రమంలో వాణిజ్య సిలిండర్లు సరఫరా చేస్తున్నట్లు తెలిపింది. ఎల్పీజీని అక్రమంగా నిల్వ చేసిన వారిపై చర్యలు తప్పవని హెచ్చరించింది. ఎల్పీజీ సరఫరాలో గృహాలు, ఆసుపత్రులు, హాస్టళ్లకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపింది. బుకింగ్ కోసం గ్రామాల్లో 45 రోజులు, పట్టణాల్లో 25 రోజుల కనీస గడువు ఉందని గుర్తు చేసింది.

గల్ఫ్‌లో ఉండిపోయిన

భారతీయ నౌకలు సురక్షితంగా ఉన్నాయని కేంద్రం తెలిపింది. అందులోని సిబ్బంది కూడా సురక్షితంగా ఉన్నట్లు వెల్లడించింది. హార్ముజ్ జలసంధి పరిస్థితిని ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్నట్లు తెలిపింది. నావికుల కుటుంబ సభ్యులకు సమాచారం ఎప్పటికప్పుడు చేరవేస్తున్నామని తెలిపింది.

## త్వరలో భారత్‌కు వస్తా

- మొదటి పేజి తరువాయి

ట్రంప్ పంపిన ఈ సందేశాన్ని అమెరికాకు చెందిన మితవాద కార్యకర్త, ట్రంప్ విధేయురాలు లారా లూమర్ చదివి వినిపించారు. ఈ సదస్సులో పాల్గొన్న లారా లూమర్, తాను వేదికపైకి రావడానికి సుమారు గంట ముందు అధ్యక్షుడు ట్రంప్‌తో ఫోన్‌లో మాట్లాడానని సభికులకు తెలిపారు. ఈ సందర్భంగా ట్రంప్ చెప్పిన మాటలను ఆమె యథాతథంగా వివరించారు. "నాకు ఇండియా అంటే చాలా ఇష్టం. నేను మోదీని ఎంతగానో ఇష్టపడతానని దయచేసి వారికి తెలియజేయండి. ప్రధాని మోదీ ఒక అద్భుతమైన నాయకుడు, నా మంచి స్నేహితుడు. త్వరలోనే మరో పర్యటన కోసం నేను కచ్చితంగా భారత్‌కు వస్తానని భారత ప్రజలకు చెప్పండి" అని ట్రంప్ తనతో అన్నట్లు లూమర్ పేర్కొన్నారు. అంతర్జాతీయ సంబంధాలు, ప్రపంచ రాజకీయాలపై చర్చ జరుగుతున్న ఈ సదస్సులో లూమర్ చేసిన వ్యాఖ్యలు అందరి దృష్టిని ఆకర్షించాయి. ట్రంప్, మోదీ మధ్య ఉన్న బలమైన స్నేహబంధాన్ని ఈ సందేశం మరోసారి స్పష్టం చేసింది.

గతంలో అధ్యక్షుడు ట్రంప్, ప్రధాని మోదీ మధ్య ఉన్న స్నేహం ప్రపంచవ్యాప్తంగా పలుమార్లు చర్చనీయాంశమైన విషయం తెలిసిందే. ముఖ్యంగా 2020లో ట్రంప్ భారత పర్యటన సందర్భంగా అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియంలో లక్షలాది మంది ప్రజల మధ్య నిర్వహించిన 'నమస్తే ట్రంప్' కార్యక్రమం వారిద్దరి మధ్య ఉన్న వ్యక్తిగత బంధానికి నిదర్శనంగా నిలిచింది. ఇరు దేశాల మధ్య వాణిజ్యం, రక్షణ, వ్యూహాత్మక భాగస్వామ్యం వంటి రంగాల్లో సహకారాన్ని పెంపొందించుకుంటూ ఇరువురు నేతలు పలు సందర్భాల్లో ఒకరిపై ఒకరు ప్రశంసలు కురిపించుకున్నారు.

## యుద్ధం వేళ.. ప్రజల్లో భయం పుట్టిస్తున్నారు

- మొదటి పేజి తరువాయి

పర్యటించారు. ఇక్కడ నిర్వహించిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ, ఇరాన్, అమెరికా-ఇజ్రాయెల్ మధ్య జరుగుతున్న యుద్ధానికి సంబంధించి భారతీయుల్లో ఆందోళనలు సృష్టించేందుకు కాంగ్రెస్ ప్రయత్నిస్తోందని ఆరోపించారు. జాతీయ ప్రయోజనాల విషయంలో ఆ పార్టీ విఫలమైందని ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశంలో భయాందోళనలు సృష్టించి తనను వేధించాలని చూస్తున్నారని అన్నారు. మనదేశ అభివృద్ధిని జీర్ణించుకోలేని శక్తుల చేతుల్లో కాంగ్రెస్ కీలుబొమ్మగా మారుతోందని ఆరోపించారు. అసోం ప్రజలు ఇక్కడి నుంచి కాంగ్రెస్ పార్టీని ఎప్పుడో తరిమి కొట్టారని కితాబిచ్చారు. రానున్న ప్రతి ఎన్నికల్లో ప్రతి రాష్ట్రం కాంగ్రెస్ పార్టీకి గుణపాఠం చెబుతుందని అన్నారు. అసోం పట్ల లేదా దేశం పట్ల కాంగ్రెస్ పార్టీకి చిత్తశుద్ధి లేదని విమర్శించారు. కానీ మోదీని ఎలా విమర్శించాలో, అబద్ధాలు చెప్పి ప్రజలను ఎలా తప్పుదారి పట్టించాలో తెలుసని ఎద్దేవా చేశారు.

కొద్దిరోజుల క్రితం ఢిల్లీలో జరిగిన ఏఐ ఇంపాక్ట్ సదస్సులో యూత్ కాంగ్రెస్ నాయకులు చొక్కాలు విప్పి నిరసన తెలిపిన విషయం తెలిసిందే.

ఈ ఘటనపై కూడా ప్రధాని స్పందించారు. వారి చర్యను యావత్ దేశం ఖండించిందని అన్నారు. ఓటమితో నిరాశ చెందిన కాంగ్రెస్ పార్టీ దేశం పైనే దాడికి దిగిందని మండిపడ్డారు. నిరాశతో దుస్తులు చించుకోవడం తప్ప వారికి మిగిలిందేమీ లేదని అన్నారు.

## గ్యాస్ సరఫరా, వినియోగంపై పయ్యావుల కేశవ్ కీలక వ్యాఖ్యలు

- మొదటి పేజి తరువాయి

ప్రాంతాల్లో 45 రోజుల గడువు విధించినట్టు తెలిపారు. డబుల్ సిలిండర్ ఉన్న వారికి 32 రోజుల చొప్పున రీఫిల్ బుకింగ్‌పై పరిమితి విధించినట్లు మంత్రి వివరించారు.

ప్రస్తుత అంతర్జాతీయ పరిస్థితుల వల్ల గ్యాస్ సరఫరాలో కొన్ని ఇబ్బందులు ఎదురవుతున్నప్పటికీ... ఆసుపత్రులు, హాస్టళ్లు, గృహ అవసరాలకు మొదటి ప్రాధాన్యత ఇస్తున్నామని పయ్యావుల కేశవ్ తెలిపారు. దేశీయంగా గ్యాస్ ఉత్పత్తిని పెంచాలని కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే రిఫైనరీలను ఆదేశించిందని, ప్రస్తుతం 10 నుంచి 20 శాతం వరకు ఉత్పత్తి మన దేశంలోనే జరుగుతోందని వెల్లడించారు. హోటల్ అసోసియేషన్లతో కూడా చర్చలు జరుపుతున్నామని, వారు బొగ్గుతో నడిచే తందూరి బట్టీల వంటి ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషిస్తున్నారని చెప్పారు. సోలార్ కుకింగ్ విధానాలను ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని, ప్రధాన ఆలయాల్లో ఇప్పటికే స్టీమ్ కుకింగ్ అమలులో ఉందని ఆయన గుర్తుచేశారు. రాష్ట్రంలో గ్యాస్ ధరలు పెరగకుండా ప్రభుత్వం నిరంతరం పర్యవేక్షిస్తోందని, ప్రజలు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని మంత్రి భరోసా ఇచ్చారు. సోమవారం నాడు ముఖ్యమంత్రి చంద్రబాబు స్వయంగా ఆర్‌టీజీఎస్ ద్వారా అన్ని బృందాలతో సమావేశమై గ్యాస్ సరఫరా పరిస్థితిని సమీక్షించనున్నారని వెల్లడించారు. అధిక ధరలు వసూలు చేసే హోటళ్లపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

## తన ఇంటికి సీఎం చంద్రబాబు రావడం పట్ల అల్లు శిరీష్ ఆనందం...



టాలీవుడ్ యువ కథానాయకుడు, నిర్మాత అల్లు అరవింద్ చిన్న కుమారుడు అల్లు శిరీష్ ఇటీవల నయనికా రెడ్డిని వివాహం చేసుకుని ఓ ఇంటివాడైన సంగతి తెలిసిందే. ఈ నూతన దంపతులను ఆశీర్వదించడానికి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు స్వయంగా వారి ఇంటికి వెళ్లారు. వధూవరులు శిరీష్, నయనికలను ఆశీర్వదించి, వారికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ అనూహ్య పరిణామంపై అల్లు శిరీష్ సోషల్ మీడియా వేదికగా తన సంతోషాన్ని పంచుకున్నారు. చంద్రబాబుతో భేటీ తన జీవితంలో అత్యంత గుర్తుండిపోయే అనుభవమని పేర్కొన్నారు. "ఇది నాకు దక్కిన గొప్ప గౌరవం. దశాబ్దాలుగా నేను ఆరాధించే నాయకుడు, మన ఏపీ సీఎం చంద్రబాబు గారు మా ఇంటికి వచ్చి నన్ను, నయనికను ఆశీర్వదించారు. ఆ దార్శనిక నేతతో గంటసేపు మాట్లాడటం ద్వారా ఎన్నో విషయాలు నేర్చుకున్నాను" అని శిరీష్ తన పోస్ట్‌లో పేర్కొన్నారు. ఇటీవల అల్లు శిరీష్, నయనికా రెడ్డిల వివాహం హైదరాబాద్‌లో ఘనంగా జరిగింది. అనంతరం ఏర్పాటు చేసిన రిసెప్షన్‌కు సినీ, రాజకీయ రంగాలకు చెందిన పలువురు ప్రముఖులు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఇప్పుడు స్వయంగా ముఖ్యమంత్రి చంద్రబాబు వారి ఇంటికి వెళ్లి శుభాకాంక్షలు తెలపడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబుతో అల్లు అరవింద్ తదితరులు సమావేశమై కాసేపు ముచ్చటించారు. చంద్రబాబుతో శిరీష్ దంపతులు ఉన్న ఫొటోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

## మంత్రి లోకేశ్ ఇంట సంబరాలు

- మొదటి పేజి తరువాయి

హాజరై మనవడికి దీవెనలు అందించారు. అటు, దేవాన్ష్ తాతయ్య నందమూరి బాలకృష్ణ, అమ్మమ్మ వసుంధర కూడా హాజరై మనవడి పంచెకట్టు వేడుకను సంతోషంగా తిలకించారు. ఇక బాలకృష్ణ తనయుడు మోక్షజ్ఞ కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నాడు. తెలుగు సంప్రదాయం ప్రకారం మోక్షజ్ఞ మేనమామ హోదాలో దేవాన్ష్ కు కొత్త దుస్తులు బహూకరించాడు.

## తెలంగాణ రాష్ట్రంలో ఆల్‌టైమ్ గరిష్ఠానికి విద్యుత్ వినియోగం

- మొదటి పేజి తరువాయి

రోజురోజుకీ విద్యుత్ డిమాండ్ పెరుగుతోంది. ఇదిలా ఉండగా, రాష్ట్రంలో భవిష్యత్తు అవసరాలకు సిద్ధంగా ఉన్నట్లు తెలంగాణ రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క అన్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందిలేకుండా నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేసిన సిబ్బందికి ఆయన అభినందనలు తెలియజేశారు.

## యూఏఈలో అతిపెద్ద టెర్మినల్‌పై ఇరాన్ డ్రోన్ దాడి

- మొదటి పేజి తరువాయి

మంట లు చెలరేగాయి. ఈ ఫుజైరా చమురు కేంద్రం ప్రపంచంలోనే పెద్దది కావడం గమనార్హం. ఇది హోర్ముజ్ జలసంధికి వెలుపల ఉంటుంది. హోర్ముజ్ జలసంధి మూసివేసినప్పటికీ ఈ ఫుజైరా ఇంధన నిల్వ కేంద్రం పోర్ట్ నుంచి చమురు ఎగుమతులు జరుగుంటాయి. ఇరాన్‌లోని ఖర్గ్ ఐలాండ్‌పై అమెరికా దాడి అనంతరం, కొన్ని గంటల్లోనే ఇరాన్ డ్రోన్ బాంబులతో విరుచుకుపడింది. ఈ దాడితో ఫుజైరాలో మంటలు, నల్లటి పొగ అలుముకుంది. అయితే ఇరాన్ డ్రోన్ తో దాడి జరపగా, ఆ డ్రోన్ ను పేల్చివేసినట్లు తెలుస్తోంది. ఈ డ్రోన్ శకలాలు పడిన ప్రాంతం నుంచి పొగలు వస్తున్నాయని స్థానిక అధికారులు చెబుతున్నారు. ఫుజైరా కీలక ఇంధన నిల్వ కేంద్రం కావడంతో ఇరాన్ దీనిని లక్ష్యంగా చేసుకుంది. ఫుజైరా ఆయిల్ డిపో, పోర్టుపై బాంబులు, మిసైళ్లతో దాడికి పాల్పడింది. దాడికి సంబంధించిన వీడియోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యాయి. వెంటనే అప్రమత్తమైన యూఏఈ ఫుజైరా చమురు పోర్టును తాత్కాలికంగా మూసివేసింది. చమురు ఎగుమతులు, దిగుమతులను నిలిపివేసింది. గల్ఫ్ దేశాల చమురు ఎగుమతులు, దిగుమతులకు ఇది ప్రధాన కేంద్రం. ఫుజైరా చమురు పోర్టును మూసివేస్తే భారత్, చైనా, పాకిస్థాన్ సహా వివిధ దేశాల్లో పెట్రోల్, డీజిల్ కొరత ఏర్పడే అవకాశం ఉంది.

## 2011 నాటి ఫొటోతో గ్యాస్ పై కాంగ్రెస్ తప్పుడు ప్రచారం చేస్తోంది

- మొదటి పేజి తరువాయి

శనివారం ఆరోపించారు. ఈ మేరకు ఆయన సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్'లో ఓ పోస్ట్ చేశారు. 2011లో ఎల్పీజీ సిలిండర్ల కోసం ప్రజలు క్యూలో నిల్చున్న ఫోటోను కాంగ్రెస్ ఇప్పుడు వాడుకుంటోందని ఆయన ఆధారాలతో సహా బయటపెట్టారు. "ఇలాంటి చర్యలతో కాంగ్రెస్ పార్టీ తనను తాను అవమానించుకోవద్దు" అని ఆయన హితవు పలికారు. ప్రధాని నరేంద్ర మోదీ బలమైన నాయకత్వంలో దేశం సురక్షితంగా ఉందని, ఇంధన సరఫరాకు ఎలాంటి ఢోకా లేదని రిజిజు భరోసా ఇచ్చారు.

మరోవైపు, బీజేపీ జాతీయ ఐటీ సెల్ ఇన్‌చార్జ్ అమిత్ మాలవీయ కూడా ఈ విషయంపై స్పందించారు. ఇరాన్ సంక్షోభం తర్వాత జీ20 దేశాల్లో పెట్రోల్ ధరల పెరుగుదలను వివరిస్తూ ఓ జాబితాను విడుదల చేశారు. ఆ జాబితా ప్రకారం, అమెరికాలో 22 శాతం ధర పెరగగా, భారత్‌లో మాత్రం ధరల్లో ఎలాంటి మార్పు లేదు. భారత్‌తో పాటు సౌదీ అరేబియా, ఇండోనేషియాలో కూడా ధరలు పెరగలేదని ఆయన పేర్కొన్నారు. దేశంలో ముడి చమురు, పెట్రోల్, డీజిల్, ఎల్పీజీలకు సరిపడా నిల్వలు ఉన్నాయని విదేశాంగ శాఖ కూడా స్పష్టం చేసింది. ఇరాన్ ప్రాంతంలో ఉద్రిక్తతలను తగ్గించాలని భారత్ పిలుపునిచ్చిందని, సముద్ర వాణిజ్య కార్యకలాపాలకు భద్రత కల్పించి, ప్రభావిత ప్రాంతంలోని భారతీయ నావికులను స్వదేశానికి రప్పించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని కేంద్ర ప్రభుత్వం తెలిపింది.

## అమరావతి గ్రామాల్లో సౌకర్యాలపై మంత్రి నారాయణ కీలక ప్రకటన

- మొదటి పేజి తరువాయి

ఆరు నెలల్లోనే పూర్తి చేస్తామని వెల్లడించారు. ప్రస్తుతం రాజధాని నిర్మాణ పనుల్లో సుమారు 30,000 మంది కార్మికులు నిరంతరం శ్రమిస్తున్నారని ఆయన ఈ సందర్భంగా గుర్తుచేశారు. రాజధాని నిర్మాణ గడువులపై కూడా నారాయణ కీలక వివరాలు వెల్లడించారు. ఈ ఏడాది జూన్ నాటికి ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, అధికారుల నివాస భవనాలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. అలాగే, 2027 జూన్ నాటికి 360 కిలోమీటర్ల ట్రంక్ రోడ్లు, 1,500 కిలోమీటర్ల లేఅవుట్ రోడ్ల నిర్మాణాన్ని పూర్తి చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నామని చెప్పారు. ఇక అమరావతికి తలమానికంగా నిలిచే ఐకానిక్ భవనాలు 2028 డిసెంబర్ నాటికి పూర్తవుతాయని వివరించారు. నిన్ననే ఉండవల్లి వద్ద స్టీల్ బ్రిడ్జ్ పనులను పరిశీలించిన మంత్రి, నేడు నేరుగా గ్రామాల్లో పర్యటించి ప్రజలకు భరోసా కల్పించడం విశేషం.

# జాతీయ లోక్ అదాలత్ లో 522 కేసులు పరిష్కారం

**ఆలమూరు, పెన్ పవర్, మార్చి 14;** స్థానిక స్పెషల్ జ్యుడిషియల్ సెకండ్ క్లాస్ జడ్జి కోర్టు, జూనియర్ సివిల్ జడ్జి కోర్టు లో శనివారం జరిగిన జాతీయ లోక్ అదాలత్ లో 522 కేసులు పరిష్కారమయ్యాయి. స్థానిక కోర్టుల్లో క్రిమినల్ కేసులకు సంబంధించి 96 కేసులను పరిష్కరించి రూ 21.50 లక్షలు అపరాధ రుసుం వివరించారు. అలాగే సాధారణ కేసులకు సంబంధించి 426 కేసులు పరిష్కరించి వారి వద్ద నుంచి రూ 75200 అపరాధ రుసుం వసూలు చేసినట్లు కోర్టు అధికారులు, సిబ్బంది తెలిపారు.




పెన్ పవర్
కాకినాడ
డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా

# గ్యాస్ కొరత లేదు






- గృహ వినియోగదారులకు నిరంతరం సరఫరా చేయాలి
- జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ ఆదే

**అమలాపురం/అంబాజీపేట, పెన్ పవర్, మార్చి 14:** 'ఇరాన్ ఇజ్రాయిల్ యుద్ధ నేపథ్యంలో ప్రభుత్వం నిర్దేశించిన ప్రాధాన్యతా రంగాలకు మాత్రమే ఎల్ పిజి నిరంతరాయంగా సరఫరా చేయాలని ఇతర రంగాలకు మళ్లింపును నిలుపుదల చేయాలని డీలర్లను జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ ఆదేశించారు. శనివారం స్థాని కలెక్టరేట్ నుండి జిల్లాలోని 25 గ్యాస్ సమావేశం నిర్వహించి గృహ వినియోగ దారులకు గ్యాస్ కొరత లేకుండా ప్రభుత్వ ఆదేశాలను పాటించాల న్నారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎల్ పిజి గ్యాస్ డీలర్లు గృహ వినియోగ దారులకు సరఫరా లో కీలక భూమిక పోషించాలన్నారు ప్రస్తుతం ఉన్న ఎల్ పిజి సరఫరా పరిస్థితి గురించి మీ అందరికీ బాగా ఆకలింపు చేసుకుని ప్రభుత్వానికి పూర్తిగా సహకరించాలని కోరారు ముందుగా దేశీయ ఎల్ పిజి కి ఖచ్చితంగా కొరత లేదని స్పష్టం చేశారు. అన్ని లైన్ డిపార్ట్మెంట్ అధికారులు తమ యూ నిట్ల ద్వారా విస్తృత ప్రచారం చేస్తూ ప్రజలు పానిక్ బుకింగ్‌లో పాల్గొన వద్దని సూచించాలన్నారు. ఈ రకమైన పానిక్ బుకింగ్ కృత్రిమ కొరతకు దారి తీస్తుందన్నారు. గృహ అవసరాలకు కొరత లేదని మరియు పానిక్ బుకింగ్‌ను కూడా నివారించాలని సూ చించారు. ప్రభుత్వం గృహ రంగానికి ఎల్ పి జి నిరంత రాయంగా సరఫరా చేయడానికి కట్టుబడి ఉందన్నారు. జిల్లా సంక్షేమ శాఖల హెచ్ఓడీలకు ఎల్‌పిజి నిరంతరాయంగా సరఫరా చేయబడు తుం దని భరోసాని ఇచ్చారు సంక్షేమ శాఖలు డిఎస్ఓతో సమన్వయం చేసుకోవాలన్నారు. మిడ్-డే-మీల్ పథకాలు మరియు అంగన్వాడీ పథకాలకు ఎల్ పిజి సిలిండర్ల నిరంతర సరఫరా జరుగుతుంద న్నారు.డిఈవో పిడి ఐసిడిఎస్ డిఎస్ వో తో సమన్వయం చేసుకోవాలన్నారు. ఆరోగ్య సంరక్షణ రంగానికి కూడా సరఫరా లు కొనసాగుతాయన్నారు. డిఎంహెచ్ వో, డిసిహెచ్ వో, ఆరోగ్యశ్రీ సమన్వయకర్త అన్ని ఆసుపత్రులు, సంబంధిత సంస్థలకు సందేశం వెళ్లాలన్నారు అన్ని పనులు సజావుగా జరగడానికి వీలుగా కలెక్టరేట్‌లో 9441692275 ఫోన్ నంబర్‌తో జిల్లా స్థాయి కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయబడిందన్నారు.ఈ కంట్రోల్ రూమ్ ఉదయం 8 గంటల నుండి రాత్రి 8 గంటల వరకు పనిచే స్తుందన్నారు. వినియోగ దారులు ఈ నంబర్‌కు కాల్ చేసి ఏవైనా సమస్యలు ఉంటే తెలియజేయ వచ్చునన్నారు జిల్లా పరిపాలనతో చేయి చేయి కలిపి పనిచేయా లన్నారు సేల్స్ అధికారులు, వారు వారంలో రెండు రోజులు జిల్లాలో పర్యటించి, ఎల్ పిజి ఏజెన్సీలను విస్తృతంగా తనిఖీ చేసి, ఉల్లంఘనను గమనించిన చోట చర్యలు తీసుకోవాలన్నారు వినియోగదారులకు నిరంతర సరఫరాను నిర్ధారించడానికి మరియు భయపడకుండా బల్క్ సందేశాలు పంపబడతా యన్నారుఅధికారులతో కూడిన ఎల్ పిజి మానిటరింగ్ టీం వాట్సాప్ గ్రూప్‌ను రూపొందించి ఎప్పటిక ప్పుడు ఫోటోలతో కూడిన సమాచారం తెలియజే యాలన్నారు. మండల స్థాయిలో తహశీల్దార్లు కీలక పాత్ర పోషించాలనీ మండల స్థాయిలో ఒక కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసి, ప్రింట్ మరియు ఎలక్ట్రానిక్ మీడియా ద్వారా కంట్రోల్ రూమ్ నంబర్‌కు తెలపాలన్నారు హోటళ్ళు, రెస్టారెంట్లు, హోటళ్ళు, రిసార్ట్‌లు, పెద్ద క్యాటరింగ్ సంస్థలకు రోజువారీ తనిఖీలు నిర్వహించాలన్నారు, డొమెస్టిక్ సిలిండర్లు వాడుతున్నట్లు గమనించినట్లయితే, వాటిని స్వాధీనం చేసుకుని 6ఏ కేసులు నమోదు చేయాలన్నారు. హాస్టళ్లు, పాఠశాలలు, అంగన్వా డీలను సందర్శించి వారిలో విశ్వాసాన్ని నింపాలన్నారు. గృహ ఎల్ పిజి సిలిండర్లను వాణిజ్య రంగానికి మళ్లించడం ఖచ్చితంగా నిషేధించబడిందన్నారు. పౌర సరఫరాలు, లీగల్ మెట్రాలజీ అధికారులతో కూడిన బృందాలు, అన్ని రకాల ఆహార తయారీ వ్యాపార సంస్థలను తీవ్రంగా తనిఖీ చేసి అవసరమైన చోట కేసులను బుక్ చేస్తాయన్నారు ఈ విషయంలో పోలీసు శాఖ కీలక పాత్ర పోషించాల్సి ఉందన్నారు. తనిఖీల సమయంలో ఏవైనా శాంతిభద్రతల సమస్యలు ఉత్పన్నమైతే పరిష్కరిస్తారన్నారు మళ్లింపు, అనధికార వినియోగం, అనధికార నిల్వ మరియు గృహ ఎల్ పిజి ని చిన్న సిలిండర్లలోకి నింపడం వంటి చర్యలను పోలీస్ శాఖ విలువరించాలన్నారు. జిల్లా జాయింట్ కలెక్టర్ నిశాంతి ప్రసం గిస్తూ ఆహార భద్రతా చట్టం కింద సమగ్ర కేసులు నమోదు చేయాలన్నారు. ఆహార భద్రతా చట్టాన్ని ఉల్లంఘించే వారిపై పీడీ చట్టం కింద కూడా కేసు నమోదు చేయబడుతుం దని స్పష్టంగా సూచించాల న్నారు. ఎల్ పిజి డీలర్లు ఆన్‌లైన్ బుకింగ్ కస్టమర్లకు మాత్రమే ఓటిపి ద్వారా రక్షించబడిన డెలివరీలకు సరఫరా చేయాలని నిర్ధారించారన్నారు భయాందోళనలను నివారించ డానికి పట్టణ, గ్రామీణ వినియోగదారులకు 2 బుకింగ్‌ల మధ్య 25 రోజుల పరిమితి ఉందన్నారు. జిల్లా ఎస్పీ రాహుల్ మీనా ప్రసంగిస్తూ గ్యాస్ సక్రమంగా పంపిణీ కాబడేలా పోలీస్ శాఖ తమవంతు పాత్ర పోషిస్తుంది అన్నారు డిఎస్ఓ ఉదయభాస్కర్ ప్రసంగిస్తూ పౌరులలో అవగాహన కల్పించడం ద్వారా ఎల్ పిజి సిలిండర్ల భయాందోళన బుకింగ్‌ను నివారించండి. ఎల్ పిజి సిలిండర్ల భయాం దోళన బుకింగ్‌ను నివా రించ డానికి ఓఎంసి లు వినియో గదారులకు బల్క్ సందే శాలను పంపాలన్నా రు డెలివరీ బాయ్‌లకు కఠినమైన సూచనలు ఇవ్వడం ద్వారా వారి ద్వారా దేశీయ ఎల్ పిజి మళ్లింపును నివారిం చాలన్నారు.. ఎల్ పిజి ఏజెన్సీ యజమానులు తమ నిల్వను తనిఖీ చేయ డానికి ప్రతిరోజూ తమ గోడౌన్లను తనిఖీ చేయాలి మరియు గోడౌన్ నిర్వా హకులపై పూర్తిగా ఆధార పడకూడ దన్నారు.అవగాహన కల్పించడానికి ఏజెన్సీలలో ఫ్లెక్సీల ను ఏర్పాటు చేయాలన్నా రు. పెండింగ్ కాల్స్, అందు బాటులో ఉన్న స్టాక్ మరియు క్లియరెన్స్ కోసం తీసుకునే సమయాన్ని ప్రదర్శించే నోటీసు బోర్డు ప్రదర్శించాలన్నారు. అందరి సమ న్వయంతో విధులను అంకితభావం, చిత్తశుద్ధితో నిర్వర్తించి ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా గృహ అవసరాలకు సమృద్ధిగా చేయాలని సూచించారు ఈ కార్యక్ర మంలో పలువురు అధికా రులు పాల్గొన్నారు

# కాజులూరు మండలంలో ఘనంగా జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవం





- పేదల సంక్షేమమే జనసేన పార్టీ ప్రధాన లక్ష్యం
- డిఎన్ఎఫ్ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు
- డాక్టర్ దేగల నాగేంద్ర సేవలకు ప్రశంసలు

**కాజులూరు, పెన్‌పవర్, మార్చి 14:**
కాజులూరు మండలంలో జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు గ్రామ గ్రామాన ఘనంగా నిర్వహించారు. మండలంలోని బంధనపూడి,మంజేరు, శీల,శలపాక,కాజులూరు,అయితపూడి, ఉప్పుమిల్లి తదితర గ్రామాల్లో జనసేన పార్టీ జెండాలు రెపరెపలాడాయి.
రామచంద్రపురం నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌ఛార్జి పోలిశెట్టి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో పలు ప్రాంతాల్లో పార్టీ జెండాలను ఆవిష్కరించి, పార్టీ సిద్ధాంతాలు మరియు లక్ష్యాలను కార్యకర్తలకు వివరించారు. పేదల సంక్షేమమే జనసేన పార్టీ ప్రధాన ధ్యేయమని, ప్రజల కోసం పని చేయడం పార్టీ లక్ష్యమని తెలిపారు. ప్రస్తుతం జనసేన పార్టీ 21 స్థానాలు గెలుచుకుని కూటమి ప్రభుత్వంలో కీలక పాత్ర పోషిస్తున్నదని ఆయన పేర్కొన్నారు. పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ ఇచ్చిన మార్గదర్శకాలు తమకు శిరోధార్యమని అన్నారు.

**డిఎన్ఎఫ్ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమం**

డిఎన్ఎఫ్ సంస్థ అధినేత, బంధనపూడి గ్రామ సర్పంచ్ దేగల తిరుమలవేణి తనయుడు డాక్టర్ దేగల నాగేంద్ర మాట్లాడుతూ జనసేన పార్టీ సిద్ధాంతాలు ప్రజల్లో విశేష ఆదరణ పొందుతున్నాయని అన్నారు. పార్టీ బలోపేతం కోసం కాజులూరు మండలంలో గత 15 రోజులుగా డిఎన్ఎఫ్ సంస్థ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. పార్టీ అభివృద్ధి కోసం తన వంతుగా ప్రతి సభ్యత్వానికి స్వచ్ఛందంగా రూ.200 చెల్లిస్తూ సభ్యత్వ నమోదు చేపడుతున్నానని చెప్పారు. ఇప్పటివరకు మండలంలో సుమారు వెయ్యికి పైగా

సభ్యత్వాలు నమోదు అయినట్లు వెల్లడించారు.

**పేదలు, కార్మికులకు ఉచిత సభ్యత్వ నమోదు**

జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని పేదలు, కార్మికులు, శ్రామికులకు ఒక రోజు ఉచిత సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించినట్లు పోలిశెట్టి చంద్రశేఖర్ తెలిపారు. ఈ అవకాశాన్ని బడుగు, బలహీన వర్గాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

**గ్రామస్థాయిలో పార్టీ బలోపేతానికి కృషి**

గత 15 రోజులుగా కాజులూరు మండలంలో సభ్యత్వ నమోదు ప్రచార వాహనం ద్వారా గ్రామ గ్రామాన పార్టీ సిద్ధాంతాలను ప్రజలకు చేరవేస్తూ యువ నాయకుడు డాక్టర్ దేగల నాగేంద్ర చేస్తున్న కృషి ప్రశంసనీయం అని పలువురు నాయకులు పేర్కొన్నారు. మండలంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ పార్టీ కార్యకలాపాలను విస్తరించడంలో ఆయన చురుకుగా పాల్గొంటున్నారని తెలిపారు.

**జనసేన జెండా పేదల ఆశలకు ప్రతీక**

ఏఎంసీ డైరెక్టర్, జనసేన మహిళా నేత సలాది పుష్ప మాట్లాడుతూ పేదవాడి గుండెచప్పుడు జనసేన జెండా అని అన్నారు. పార్టీ కార్యకర్తలకు జనసేన జెండా కొండంత అండగా నిలుస్తుందని పేర్కొన్నారు.
కూనపు రెడ్డి శివకృష్ణ మాట్లాడుతూ పవన్ కళ్యాణ్ ఆశయాలు రాష్ట్ర అభివృద్ధికి ఆదర్శంగా నిలుస్తాయని అన్నారు.

**పలు గ్రామాల్లో జెండా ఆవిష్కరణ**

మంజేరు గ్రామంలో ఎంపీటీసీ గండి మణికంఠ, ధనరాజ్, ఏఎంసీ వైస్ చైర్మన్ దడాల నాగేశ్వరి నాగార్జున ఆధ్వర్యంలో పోలిశెట్టి చంద్రశేఖర్ పార్టీ జెండాను ఆవిష్కరించారు.
శలపాక కాలువ గట్టు వద్ద పబ్బినీడి సూరిబాబు, మాధవరపు చినబాబు ఆధ్వర్యంలో గ్రామ సర్పంచ్ పోతుల గనిరాజు, సబ్బినీడి శ్రీనివాసరావు చౌదరి (పెదబాబు) సంయుక్తంగా పార్టీ జెండా ఆవిష్కరించారు.
ఈ కార్యక్రమంలో అన్యం శ్రీరాం, యాళ్ల వెంకటరమణ, లకాని కృష్ణచైతన్య, దుర్యోదనుల సత్యనారాయణ, గండి సత్యనారాయణ, యర్రంనీడి గోవిందు, సలాది బాబ్జి, గరగ అర్జిబాబు, గరగ చంద్రబాబు, వనుం ఈశ్వరరావు తదితర నాయకులు, కార్యకర్తలు మరియు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



# పినపళ్ల లో ఘనంగా జనసేన ఆవిర్భావ వేడుకలు

**ఆలమూరు, పెన్ పవర్, మార్చి 14;** జనసేన పార్టీ 13 వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా కొత్తపేట జనసేన ఇన్చార్జ్ బండారు శ్రీనివాస్ ఆదేశాల మేరకు పినపళ్ల సర్పంచ్ సంగీత సుభాష్ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా వేడుకలు నిర్వహించారు. జనసేన పార్టీ జెండాను ఆవిష్కరించారు. కుల,మతాలకు అతీతంగా సమాజంలో అందరూ సమాన స్థాయిలో అభివృద్ధి చెందాలనేదే జనసేన లక్ష్యమని ఆయన ఈ సందర్భంగా తెలిపారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆశయాలను మరింతగా ప్రజల్లోకి తీసుకొని వెళ్లి పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ పెద్దిరెడ్డి పట్టాభి రామారావు, ఉప సర్పంచ్ యనమదల రాణి శ్రీనివాస్, గ్రామ అధ్యక్షులు నామాల సుబ్బారావు, జనసైనికులు, వీర మహిళలు పాల్గొన్నారు.



01
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
క్లాసీఫైడ్ యాడ్స్
కేవలం
యాడ్ 100/-కే
' ఐదు రోజులకు '
'4 సెం.మీ 4 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

# కృష్ణవరంలో కన్నులపండుగగా శ్రీ సీతారాముల విగ్రహ ప్రతిష్ట మహోత్సవం.





**-ముఖ్యఅతిథిలుగా పాల్గొన్న ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, మణి దంపతులు**

**కిర్లంపూడి, పెన్ పవర్,మార్చి 14:** కాకినాడ జిల్లా కిర్లంపూడి మండలం కృష్ణవరం గ్రామంలో శ్రీ సీతారాముల పట్టాభిషేక విగ్రహ ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమం అంగరంగ వైభవంగా జరిగింది. గ్రామ పెద్దలు బొదిరెడ్ల సుబ్బారావు ఉమామహేశ్వరి దంపతులచే శ్రీ సీతారామ, లక్ష్మణ, భరత, శత్రుఘ్న, విగ్రహాల ప్రతిష్ట కార్యక్రమాలకు జగ్గంపేట ఎమ్మెల్యే,టిటిడి పాలక వర్గ సభ్యులు జ్యోతుల నెహ్రూ మణిమ్మ దంపతులు ముఖ్య అతిధులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సీతారాముల పట్టాభిషేక విగ్రహాలను దర్శించుకుని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ వారు మాట్లాడుతూ శ్రీ సీతారాముల పట్టాభిషేక విగ్రహ ప్రతిష్ట మహోత్సవం కనులు పండుగ నిర్వహించుకున్నామని శ్రీ సీతారాముల పట్టాభిషేకం ధర్మ సంస్థాపనకు, సుపరిపాలనకు ప్రతీక సీతారాముల జీవితం అందరికీ స్ఫూర్తి అని వారి ఆశీస్సులతో ఈ ప్రాంతమంతా సుభిక్షంగా ఉండాలని ఈ కార్యక్రమం చేపట్టమన్నారు. ఈ కార్యక్రమంలో జీనుమణి బాబు, కొత్త కొండబాబు, దేవరపల్లి మూర్తి, పాలచర్ల నాగేంద్ర చౌదరి, మాజీ ఎంపీటీసీ బోదిరెడ్ల పుష్పారత్నం,కంచుమర్తి రాఘవ, దాపర్తి సీతారామయ్య, బొడ్డేటి సుమన్,బిజెపి మండల అధ్యక్షుడు శరకణం రాజబాబు, బిజెపి పూర్వ అధ్యక్షుడు యడాలి రాంబాబు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# కోనసీమ తిరుమల వాడపల్లిలో ఏకాదశి సందడి





- భక్తులకు కట్టెలపై వండి అన్నదానం

**ఆత్రేయపురం, పెన్ పవర్ మార్చి 14:**కోనసీమ తిరుమలగా ప్రసిద్ధి చెందిన వాడపల్లి శ్రీ వెంకటేశ్వర స్వామి క్షేత్రంలో శనివారం ఏకాదశి సందర్భంగా భక్తులు లక్షణాద్రిగా తరలివచ్చారు. శనివారం తెల్లవారుజాము నుంచే స్వామివారి దర్శనం కోసం భారీగా భక్తులు క్యూలలో నిలిచి భక్తి శ్రద్ధలతో దర్శనం చేసుకున్నారు. కోనసీమతో పాటు తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలు తో పాటు తెలుగు రాష్ట్రాల నుండి కూడా భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి చేరుకున్నారు.ప్రస్తుతం ప్రపంచ దేశాల్లో జరుగుతున్న యుద్ధాల ప్రభావంతో చమురు, గ్యాస్ కొరత ఏర్పడుతున్న పరిస్థితుల్లో కొన్ని ప్రాంతాల్లో హోటళ్లు, రెస్టారెంట్లు మూతపడుతున్నాయి. అయినప్పటికీ వాడపల్లి క్షేత్రంలో భక్తులకు అన్నదానం నిలిచిపోకుండా ఆలయ నిర్వాహకులు చర్యలు తీసుకుంటున్నారు. గ్యాస్ అందుబాటులో లేకపోయినా భక్తులకు భోజనం అందించాలనే సంకల్పంతో కట్టెలపై వంట చేసి అన్నదానం నిర్వహిస్తున్నారు. ఆలయానికి వచ్చే భక్తులు ఆకలితో ఇబ్బంది పడకూడదనే ఉద్దేశంతో అన్నదానం కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నామని ఆలయ ఉప కమిషనర్ నల్ల సూర్య చక్రధర్ రావు తెలిపారు. ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో కూడా భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్నదానం ఏర్పాటు చేస్తున్నామని ఆయన పేర్కొన్నారు.వాడపల్లి క్షేత్రంలో భక్తులకు భోజనం అందించే ఈ సేవా కార్యక్రమాన్ని చూసి భక్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. స్వామివారి సన్నిధిలో భక్తులకు సేవ చేయడం తమకు అదృష్టంగా భావిస్తున్నామని నిర్వాహకులు తెలిపారు.ఏకాదశి సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించగా, భక్తులు స్వామివారికి మొక్కులు చెల్లించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ పరిసరాల్లో భక్తుల రద్దీతో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.



# నిస్వార్థ నాయకుడు స్టాలిన్ బాబు

- ఎమ్మెల్సీ ఇజ్రాయిల్







**అంబాజీపేట, పెన్ పవర్, మార్చి 14:**బడుగు బలహీన వర్గాల అభిమానం చూరగొని, తన రాజకీయ ప్రస్థానంలో నిస్వార్థ నాయకుడిగా ఎదిగి... ప్రజా హృదయాల్లో నిజమైన నాయకుడు స్థానం సంపాదించుకున్న స్టాలిన్ బాబు అభినందనీయుడని ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ కొనియాడారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యులు నేలపూడి స్టాలిన్ బాబు పుట్టినరోజు వేడుకలు శుక్రవారం రాత్రి అంబాజీపేట లో ఆయన స్వగృహం వద్ద ఘనంగా జరిగాయి. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్సీ ఇజ్రాయిల్ మాట్లాడుతూ ఎస్సీ ఎస్టీ సబ్ ప్లాన్ నిధుల ద్వారా ఎన్నో దళిత కాలనీల అభివృద్ధికి ఆయన కృషి చేశారని, సబ్ ప్లాన్ నిధుల సక్రమ అమలు కొరకు స్టాలిన్ బాబు విశేష కృషి చేశారని అన్నారు. ప్రజా సేవకుడిగా, రచయితగా, విద్యావేత్తగా అందరికీ సుపరిచితులైన స్టాలిన్ బాబు కు మంచి రాజకీయ భవిష్యత్తు ఉందని ఆకాంక్షించారు. ప్రజా సమస్యల విషయంలోనూ ప్రజల దైనందిన అవసరాలైన విద్యా వైద్యం అందరికీ అందాలని ఆయన ఆకాంక్షిస్తారని అన్నారు. అనంతరం నాయకులు అభిమానులు గజమాలతో సత్కరించి కేక్ కట్ చేయించారు. వైయస్సార్ పార్టీ తాజా ,మాజీ ప్రజా ప్రతినిధులు, అభిమానుల కోలాహలం మధ్య పుట్టినరోజు వేడుకలు అటహాసంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో పి.గన్నవరం వైఎస్ఆర్సిపి కోఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు, మాజీ పార్లమెంట్ సభ్యులు చింతా అనురాధ, వైఎస్ఆర్సిపి రాష్ట్ర కార్యదర్శి చెల్లుబోయిన శ్రీనివాస్, ఎస్.ఇ. సి సభ్యులు కుడిపూడి భరత్ భూషణ్, జిల్లా పార్టీ ఉపాధ్యక్షులు కుడిపూడి విద్యాసాగర్, జిల్లా సోషల్ మీడియా అధ్యక్షులు దొమ్మేటి సత్య మోహన్, నియోజకవర్గ సోషల్ మీడియా అధ్యక్షులు దొమ్మేటి దుర్గారావు, మండల పార్టీ అధ్యక్షులు విత్తనాల ఇంద్ర శేఖర్, ఎన్నాబత్తుల ఆనంద్, ఎంపీపీలు దొమ్మేటి వెంకటేశ్వరరావు, కుసుమ వనజ కుమారి, జడ్పీటీసీ బూడిద వరలక్ష్మి, వైస్ ఎంపీపీలు బయ్యా చిన్నబాబు, సుధాబత్తుల లక్ష్మీ భార్గవి రాము,ఎంపీటీసీ సమాఖ్య అధ్యక్షులు ముత్తబత్తుల ప్రశాంత్ యడ్ల కిరణ్ బాబు, ఎంపీటీసీలు వడలి కృష్ణమూర్తి, వనచర్ల విజయదుర్గ పండు, బుడితి సత్యనారాయణమ్మ, మైలే నాగలక్ష్మి, సర్పంచులు కోట బేబీ రాణి, వాసంశెట్టి రేవతి పెదబాబు, గుమ్మడి ప్రసాద్, వడలి కొండయ్య,మాజీ సర్పంచులు నూకపెయ్యి చిన్న, కాండ్రేగుల గోపాలకృష్ణ, నాగబత్తుల శ్రీను, దేవరపల్లి చిన్న బాలయోగి, అందే వెంకట ముక్తేశ్వరరావు, వైయస్సార్సీపి నాయకులు పేరి శ్రీను, కొర్లపాటి కోట బాబు, ముత్తబత్తుల మణిరత్నం, మైలే ఆనందరావు, మట్టపర్తి హరి, నెల్లి సత్యనారాయణ, యజ్ఞశ్రీ వెంకటేశ్వరరావు, చింతపల్లి వెంకటేశ్వరరావు, గోసంగి సత్యనారాయణ, చింతా రాజేంద్ర ప్రసాద్, మిందగుదిటి రాంబాబు, జల్లి పండు, అడ్డగళ్ళ సాయిరాం, దేవరపల్లి గౌతమ్, సిహెచ్ రాధాబాయి, ముత్తబత్తుల సోమశేఖర్, నాగ బత్తుల రాజేష్, జల్లి సురేష్ గోపి,గోసంగి కుమారస్వామి,ఉందుర్తి ఆనందబాబు, చిల్లే ధనరాజు, గంటి శ్రీరామమూర్తి,చిల్లే శ్రీను

దళిత నాయకులు పులిదిండి సత్యనారాయణ, నాగాబత్తుల వెంకటపతి, నాగబత్తుల నరసింహమూర్తి, సాధనాల బాలకృష్ణ,ఇసుకపట్ల శ్రీనివాస్ రావు, బీర సురేష్ కుమార్, కోట గోపి, నేలపూడి సత్యనారాయణ, కాకర కృష్ణ కాంత్, నేలపూడి చినబాబు తదితరులు పాల్గొన్నారు.

# క్రీడల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుంది.

**రాష్ట్ర స్థాయి షేటల్ బాడ్మింటన్ టోర్నమెంట్ ప్రారంభ సభలో -ఎమ్మెల్యే ఆనంద రావు**




**అమలాపురం/అంబాజీపేట, పెన్ పవర్, మార్చి 14:**క్రీడాకారుల సౌకర్యార్థం అమలాపురం బాలయోగి స్టేడియం షటిల్ కోర్టుకు ఏసీ సౌకర్యం కల్పిస్తామని ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు కీలక ప్రకటన చేశారు. శనివారం జరిగిన రాష్ట్ర స్థాయి బ్యాడ్మింటన్ మాస్టర్స్ ఛాంపియన్‌షిప్ ప్రారంభోత్సవంలో ఆయన మాట్లాడుతూ, క్రీడల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, స్టేడియం ఆధునికీకరణకు నిధులు వెచ్చిస్తామని పేర్కొన్నారు.మార్చి 14, 15 తేదీల్లో జరుగుతున్న ఈ రాష్ట్ర స్థాయి బ్యాడ్మింటన్ మాస్టర్స్ ఛాంపియన్‌షిప్ - 2026 క్రీడాకారుల నైపుణ్యాన్ని చాటేందుకు మంచి వేదిక అని పేర్కొన్నారు. అమలాపురం బాలయోగి స్టేడియంలో జరుగుతున్న ఈ రాష్ట్ర స్థాయి బ్యాడ్మింటన్ మాస్టర్స్ ఛాంపియన్ షిప్‌కు విచ్చేసిన క్రీడాకారులందరికీ స్వాగతం అని జిల్లా జాయింట్ కలెక్టర్ నిషాంతి అన్నారు. జ్యోతి ప్రజ్వలనతో ఈ క్రీడా సంబరాన్ని ఎమ్మెల్యే ఆనందరావు, జేసీ నిషాంతి, మెట్ల రమణబాబు, అల్లాడ స్వామి నాయుడు ప్రారంభించారు. గెలుపోటముల కంటే స్ఫూర్తి ముఖ్యం క్రీడల్లో గెలుపు ఓటములు సహజం, కానీ క్రీడా స్ఫూర్తి అనేది చాలా ముఖ్యం. ఇక్కడ గెలిచిన వారు జాతీయ స్థాయిలో రాణించా .

లని, ఓడిన వారు తమ లోపాలను సరిదిద్దుకుని మరింత పట్టుదలతో ముందుకు సాగాలని కోరుకుంటు న్నానని ఆమె అన్నారు.

మవయసుతో సంబంధం లేకుండా క్రీడల పట్ల మీకున్న ఈ ఆసక్తి యువతకు ఎంతో స్ఫూర్తిదాయకం. బ్యాడ్మింటన్ అనేది శారీరక దృఢత్వానికి,మానసిక ఏకాగ్రతకు అత్యుత్తమ క్రీడ అని టిడిపి రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి మెట్ల రమణ బాబు అన్నారు.

ఎమ్మెల్యే ప్రకటించినట్లుగా, బాలయోగి స్టేడియంలో ఏసీ వసతి కల్పించడం ద్వారా క్రీడాకారులకు గొప్ప ప్రయోజనం కలుగుతుందిని అముడా చైర్మన్ అల్లాడ స్వామి నాయుడు అన్నారు. డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా నుండి ఎంతో మంది ప్రతిభావంతులైన క్రీడాకారులు తయారవ్వాలి. రాష్ట్ర స్థాయి టోర్నమెంట్లు ఇక్కడ నిర్వహించడం వల్ల స్థానిక క్రీడాకారులకు మంచి అనుభవం లభిస్తుందని డి ఎస్ డి ఓ రుద్ర అన్నారు.అనంతరం పోటీలను ఎమ్మెల్యే ప్రారంభంచారు. ఈ కార్యక్రమం లో స్టేడియం క్రీడాకారుడు మండేల బాబీ, స్టేడియం కోచ్ భీమేష్ తదితరులు పాల్గొన్నారు.

# వాడపల్లి క్షేత్రంలో ఐదు రోజుల ద్రవిడ వేద అధ్యాయణోత్సవాలు





**ఆత్రేయపురం, పెన్ పవర్ మార్చి 14:**కోనసీమ తిరుమలగా ప్రసిద్ధి చెందిన వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దేవస్థానంలో మార్చి 15 నుంచి 19వ తేదీ వరకు ఐదు రోజులపాటు ద్రవిడ వేద అధ్యాయణోత్సవాలను ఘనంగా నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆలయ చైర్మన్ ముదునూరి వెంకటరాజు, డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధరరావు తెలిపారు.ఉత్సవాల సందర్భంగా ప్రతిరోజూ ఆలయంలో ద్రవిడ వేద పారాయణంనిర్వహించబడుతుందని వారు వెల్లడించారు. మార్చి 15 ఆదివారం సాయంత్రం 6 గంటలకు స్వామివారి గ్రామోత్సవంతో కార్యక్రమాలు ప్రారంభమవుతాయి. అనంతరం మార్చి 16 సోమవారం సాయంత్రం 6 గంటలకు గరుడ వాహన సేవ, మార్చి 17 మంగళవారం సాయంత్రం 6 గంటలకు సింహ వాహన సేవ, మార్చి 18 బుధవారం సాయంత్రం 6 గంటలకు హంస వాహన సేవలను నిర్వహించనున్నారు.

మార్చి 19 గురువారం సాయంత్రం 6 గంటలకు గరుడ, సింహ, హంస వాహన సేవలు నిర్వహించబడతాయని అధికారులు తెలిపారు. అదే రోజు ఉదయం 9 గంటలకు ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని ఆలయంలో పంచాంగ శ్రవణం నిర్వహించనున్నారు.

ఈ ఐదు రోజుల ఉత్సవాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి దర్శనం చేసుకొని ఆశీస్సులు పొందాలని ఆలయ అధికారులు కోరారు.

# జనసేన పార్టీ ఎంపిటిసి మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు




**అమలాపురం/అంబాజీపేట, పెన్ పవర్, మార్చి 14:**జనసేన పార్టీ 13వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా అమలాపురం పట్టణం గడియార స్తంభం సెంటర్లో జనసేన పార్టీ తరఫున చిందాడగరువు జనసేన పార్టీ ఎంపిటిసి మోటూరి కనకదుర్గ వెంకటేశ్వర రావు దంపతుల ధన సహాయంతో మజ్జిగ చలివేంద్రం కార్యక్రమం నిర్వహించారు . ఈ కార్యక్రమంలో అమలాపురం నియోజకవర్గం జనసేన పార్టీ సీనియర్ నాయకులు కార్యకర్తలు జనసైనికులు వీర మహిళలు భారీ ఎత్తులో ఈ కార్యక్రమం లో పాల్గొన్నారు.

# జిఎంకె ట్రస్ట్ చే విద్యార్థులకు పరీక్షా అట్టలు పంపిణీ



**అంబాజీపేట, పెన్ పవర్, మార్చి 14:** మండల పరిధి గంగలకుర్రు అగ్రహారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి విద్యార్థులకు జిఎంకె చారిటబుల్ ట్రస్ట్ వారి నుండి పరీక్ష అట్టలు పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమం లో గంగలకుర్రు శెట్టిబలిజ సంఘ సభ్యులు విత్తనాల శేఖర్, రాయుడు షణ్ముఖ్, సంసాని మురళి, కృష్ణ తదితరులు పాల్గొని విద్యార్థులకు అట్టలు అందజేసి శుభాకాంక్షలు తెలియజేసారు. గంగలకుర్రు అగ్రహారం ఉన్నత పాఠశాలను గుర్తుపెట్టుకుని జిఎంకె ట్రస్ట్ వారు విద్యార్థులకు పరీక్ష అట్టలు పంపించడం చాలా సంతోషం గా ఉంది అని సంఘ సభ్యులు హర్షం వ్యక్తం చేసారు.

# దేవాలయాలకు దాతల సహకారం అవసరం



**అమలాపురం/అంబాజీపేట, పెన్ పవర్, మార్చి 14:** దేవాలయాల అభివృద్ధికి దాతల సహకారం మరులేనిదని పలువురు పేర్కొన్నారు.

అమలాపురం శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానానికి మేకల నరసింహారావు అన్నదానానికి మంచినీళ్ళ 60 జగ్గులు వితరణగా స్వామివారికి సమర్పించారు. ఈ కార్యక్రమంలో దేవాలయ చైర్మన్ కంచిపల్లి అబ్బులు పాలకమండలి సభ్యులు కార్యక నిర్వహణ అధికారి ఇవివి సత్యకుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ఆదిత్య విశ్వవిద్యాలయం లో విజయవంతంగా ముగిసిన అంతర్జాతీయ సదస్సు





**గండేపల్లి, పెన్ పవర్,మార్చి,14:**ఆదిత్య యూనివర్సిటీలో నిర్వహిస్తున్న ఫోరెన్సిక్ సైన్స్, సైబర్ సెక్యూరిటీ మరియు డిజిటల్ ఫోరెన్సిక్స్ పై తొలి అంతర్జాతీయ సదస్సు రెండవ రోజు కార్యక్రమాలు విజయవంతంగా ముగిశాయి. ఈ కార్యక్రమంలో దేశంలోని వివిధ ప్రాంతాల నుండి నిపుణులు, అధ్యాపకులు, పరిశోధకులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.ఈ కార్యక్రమానికి భారతీయ విజ్ఞాన సంస్థ (ఐ ఐ ఎస్ సి) కి చెందిన ప్రొఫెసర్ ఎన్. సి. శివ ప్రకాశ్ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. అలాగే ఆదిత్య యూనివర్సిటీ రిజిస్ట్రార్ డా. జి. సురేష్ కూడా కార్యక్రమానికి హాజరై విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు.

ముంబైలోని గవర్నమెంట్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఫోరెన్సిక్ సైన్స్ హెడ్ ప్రొఫెసర్ అమోల్ వి. కె. దేశ్ ముఖ్ "ట్రేసింగ్ ది అన్ ట్రేసబుల్: "ఫోరెన్సిక్ టాక్సికాలజీ ఇన్ రేడియాలజీ ఇన్ రేడియో లాజికల్ క్రైమ్స్" అనే అంశంపై ప్రసంగించారు.ఒడిశా రాష్ట్రంలోని కటక్ నగరానికి చెందిన అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ శ్రీ అక్షయ కుమార్ నాయక్ "ఎఐ-డ్రైవెన్ సైబర్ క్రైమ్ ఇన్వెస్టిగేషన్ & డిజిటల్ ఫోరెన్సిక్ ఇంటెలిజెన్స్ " అనే అంశంపై ప్రసంగించారు.థర్డ్ ఐ టెక్నో సొల్యూషన్స్ సంస్థ వ్యవస్థాపకుడు మరియు మేనేజింగ్ డైరెక్టర్ శ్రీ నీరజ్ కుమార్ "స్ట్రెమ్లైనింగ్ జస్టిస్ : లేవెరగింగ్ ఆటోమేషన్ ఇన్ డిజిటల్ ఇన్వెస్టిగేషన్ అండ్ ఎవిడెన్స్ హ్యాండ్లింగ్ " అనే అంశం పై ఉపన్యాసం ఇచ్చారు.ఈ సదస్సును ఆదిత్య యూనివర్సిటీ ఫోరెన్సిక్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో అసోసియేట్ డీన్ విలాస్ అనిల్ చవాన్ మార్గదర్శకత్వంలో పి.వి. నాగేశ్వర రావు మరియు బి.వి.ఎస్.ఎస్. ఉదయ నాథ్ సహకారంతో నిర్వహించారు.

02
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
శుభాకాంక్షలు యాడ్స్
కేవలం
యాడ్ 300/-
'పోస్టుకార్డు సైజు '
'పో. 12 సెం.మీ, వె.16 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

## ఆదిత్య యూనివర్సిటీ పూర్వ విద్యార్థి చే నేటి పరిశ్రమల అవకాశాలపై అవగాహన




**గండేపల్లి,పెన్ పవర్,మార్చి,14:** గండేపల్లి మండలం సూరంపాలెం లోని ఆదిత్య విశ్వవిద్యాలయం మెకానికల్ విభాగం ఆధ్వర్యంలో నేటి పరిశ్రమల ఉద్యోగాల అవకాశాలు పై సమావేశం జరిగిందని, యూనివర్సిటీ డిప్యూటీ ప్రో ఛాన్సలర్ డాక్టర్ ఎం. శ్రీనివాసరెడ్డి తెలియజేశారు.

ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మెకానికల్ విభాగం మొదటి బ్యాచ్ కి చెందిన విద్యార్థి దేవదాసు దీపు, ప్రొప్రైటర్. ఆధ్య కన్స్ట్రక్షన్ ఎక్విప్మెంట్ మరియు లాజిస్టిక్స్, కాకినాడ వారు హాజరయ్యారని తెలిపారు. ఈ సమ్మేళనంలో దీపు ద్వితీయ మరియు తృతీయ సంవత్సరపు విద్యార్థులతో తమ జ్ఞాపకాలు నెమర వేసుకోవడంతోపాటు ప్రస్తుత విద్యార్థులకు మార్గదర్శకత్వం ఇండస్ట్రీ ట్రెండ్స్ మరియు నైపుణ్యాభివృద్ధిపై అవగాహన కల్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మెకానికల్ విభాగాధిపతి డాక్టర్ ఎస్. డి. వి.వి.ఎస్. భీమేశ్వర రెడ్డి, డిప్యూటీ విభాగాధిపతి, శ్రీ ఏ. ఎస్. ఎస్. ఎం. సీతారామమూర్తి మరియు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఘనంగా వి రెసిడెన్సి ప్రారంభోత్సవం





**అందుబాటులో అత్యాధునిక రెసిడెన్సి**

**గండేపల్లి, పెన్ పవర్, మార్చి, 14:** జగ్గంపేట శివారు గండేపల్లి మండలం నీలాద్రి రావు పేట పంచాయితీ 16 నెంబర్ జాతీయ రహదారి ఆనుకుని అత్యాధునిక వసతులతో నిర్మాణమైన వి రెసిడెన్సి శనివారం జగ్గంపేట శాసనసభ్యులు,తిరుమల తిరుపతి దేవస్థానం పాలకమండలి సభ్యులు జ్యోతుల నెహ్రూ చేతుల మీదుగా ప్రారంభోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా వి రెసిడెన్సి యజమానులు ఒబిన్ని వీర్రాజు, కూచిపూడి వీరబాబు,మార్ని వెంకటకృష్ణ, మద్దిపాటి రాంబాబు,మనోజ్ మాట్లాడుతూ జగ్గంపేటలో సామాన్యులకు అందుబాటులో ఈ రెసిడెన్సీలో సింగిల్ ఏసీ రూములు,డబల్ ఏసీ రూములు, నాన్ ఏసీ రూములు అత్యధిక సదుపాయాలతో సరసమైన ధరలకే లభిస్తాయని 24 గంటలు రూమ్ సర్వీస్,హాట్ వాటర్ స్పెసిలిటీ,లభిస్తుందని మా రెసిడెన్సీ ప్రారంభించిన ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూకు,అఖిలపక్ష నాయకులకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమానికి మాజీ మంత్రి తోట నరసింహం,మాజీ ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు, కందుల చిట్టిబాబు,జీను మణిబాబు,శీలా మంతుల వీరబాబు, పయిన్ని వెంకటేశ్వరరావు,పాలచర్ల నాగేంద్ర చౌదరి తదితరులు పాల్గొన్నారు.

## పొట్టి శ్రీరాములు కాంస్య విగ్రహావిష్కరణకు ఎమ్మెల్యేకు ఆహ్వానం



**జగ్గంపేట, పెన్ పవర్, మార్చి 14:** పొట్టి శ్రీరాములు 125వ జయంతి ఉత్సవాల ముగింపు సందర్భంగా మార్చి 16న 58 అడుగుల కాంస్య విగ్రహావిష్కరణ అమరావతిలో జరుగుతుంది. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి లోకేష్ హాజరవుతున్నారు. ఈ కార్యక్రమానికి హాజరు కావాలని జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూకు శనివారం రాష్ట్ర ఆర్యవైశ్య వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఆ శాఖ రాష్ట్ర డైరెక్టర్ కొత్త వెంకటేశ్వరరావు (కొండబాబు) ఆహ్వాన పత్రం అందించారు.

## కామ్రేడ్ మోతా వెంకట్రావుకు విప్లవ జోహార్లు



**జగ్గంపేట, పెన్ పవర్, మార్చి 14:** అఖిల భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఏఐఎఫ్టీయూ) ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కార్యదర్శి కామ్రేడ్ మోతా వెంకటరావు 7వ వర్ధంతి సందర్భంగా శనివారం కాకినాడ జిల్లా జగ్గంపేట మండలం రామవరం గ్రామం శివారు రంగవల్లి నగర్ లో ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రైతు కూలి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు మాట్లాడుతూ కామ్రేడ్ మోత వెంకటరావు కార్మికులు, కర్షకులు, వెనుకబడిన వర్గాల కోసం అలుపెరుగని పోరాటం చేసి 2019లో మరణించడం జరిగిందని ఆయన తెలిపారు. ప్రధానంగా గోరీపట్నం, రాజమండ్రి, ఏలేశ్వరం, అనకాపల్లి క్వారీ, క్రషర్ కార్మికుల వేతన ఒప్పందంలో కీలకపాత్ర వహించారని, కామ్రేడ్ మోత వెంకటరావు మరణం కార్మిక సంఘానికి తీరనిలోటని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పి డి యస్ యు టవిజృంభనఊ రాష్ట్ర కార్యదర్శి కడితి సతీష్, సత్తిబాబు, కీర్తి, లక్ష్మి,వెంకయ్యమ్మ, సూరిబాబు, లక్ష్మణరావు, తాతబాబు తదితరులు పాల్గొన్నారు.

## గండేపల్లి లో ఘనంగా జనసేన పార్టీ 13 వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

- గండేపల్లి మండలం లో ఉన్న ఆశా వర్కర్లకు బియ్యం బస్తాల పంపిణీ





**గండేపల్లి పెన్ పవర్ ,మార్చి 14:** గండేపల్లి మండలం గండేపల్లి గ్రామం లో గండేపల్లి మండలం జనసేన పార్టీ ఆధ్వర్యంలో జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జగ్గంపేట జనసేన పార్టీ ఇంచార్జ్ తుమ్మలపల్లి రమేష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

ముందుగా జనసేన పార్టీ జెండాను ఆవిష్కరించి, పార్టీ నాయకులు మరియు కార్యకర్తలకు స్వీట్స్ పంచి, కేక్ కట్ చేసి ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం జగ్గంపేట మండలంలోని ఉన్న దివ్యంగులకు ఒక్కొక్కరికి 25 కిలోల బియ్యం బస్తాలను అందజేశారు.

ఈ సందర్భంగా తుమ్మలపల్లి రమేష్ మాట్లాడుతూ, జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని జగ్గంపేట నియోజకవర్గంలోని నాలుగు మండలాల హెడ్క్వార్టర్స్‌లో పార్టీ జెండా ఆవిష్కరణ కార్యక్రమాలు నిర్వహించామని తెలిపారు. అలాగే పారిశుధ్య కార్మికులు, అంగన్వాడీ కార్యకర్తలు మరియు వికలాంగులకు, ఆశా కార్యకర్తలు లకు ఒక్కొక్కరికి 25 కిలోల బియ్యం బస్తాలను పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు.

అదేవిధంగా జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని భారీ బాణాసంచా పేల్చి ఆనందోత్సాహాల మధ్య వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జగ్గంపేట నియోజకవర్గం జనసేన నాయకులు, జనసైనికులు మరియు అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఆదిత్య విశ్వవిద్యాలయంలో దంత వైద్య శిబిరం



**గండేపల్లి, పెన్ పవర్,మార్చి,14:**గండేపల్లి మండలం సూరంపాలెం విశ్వవిద్యాలయం ఎన్ .ఎస్.ఎస్. విభాగం ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. కాకినాడ లోని షీబా డెంటల్ మరియు ఫేస్ ఈస్తటిక్ సహకారంతో నిర్వహించిన ఈ శిబిరాన్ని ప్రో వైస్ చాన్సలర్ (ఈ & ఎస్ ) డాక్టర్ ఎ. రమేష్ మరియు డీన్ స్టూడెంట్ అఫైర్స్ డాక్టర్ డి. కిశోర్ ప్రారంభించారు.డెంటల్ సర్జన్ & ఓరల్ క్యాన్సర్ స్క్రీనింగ్ కన్సల్టెంట్ డాక్టర్ షీబా గారి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో మార్చి 13, 2026న విద్యార్థులకు ఉచిత దంత పరీక్షలు నిర్వహించగా, మార్చి 14, 2026న అధ్యాపకులు మరియు నాన్-టీచింగ్ సిబ్బంది కి పరీక్షలు నిర్వహించారు. ఈ రెండు రోజులు సుమారు 400 మంది పరీక్షలు చేయించుకున్నారు.ఈ సందర్భంగా వైద్యులు అత్యాధునిక పరికరాలతో పరీక్షించి విద్యార్థులు, అధ్యాపకులు మరియు సిబ్బంది కి దంత ఆరోగ్యం, నోటి పరిశుభ్రత మరియు దంత సమస్యల నివారణకు విలువైన సూచనలు అందించారు.ఈ కార్యక్రమాన్ని ఎన్ .ఎస్.ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్లు డాక్టర్ ఐ.వి. వీరాంజనేయులు , డాక్టర్ విజయ్ కుమార్ మరియు జి.వి. రామ్మోహన్ నిర్వహించారు.

## చెయ్యేరు లో త్రాచు పాము హల్ చల్ చేసింది



**కాట్రేనికోన పెన్ పవర్ మార్చి 14:**కాట్రేనికోన మండలంలోని చెయ్యేరు అగ్రహారంలో శనివారం మంతెన రామరాజు అనే వ్యక్తి నివాసంలోకి ఒక భారీ తాచుపాము ప్రవేశించడంతో స్థానికులు ఆందోళనకు గురయ్యారు. సమాచారం అందుకున్న భీమనపల్లికి చెందిన స్నేక్ క్యాచర్ గణేష్ వర్మ వెంటనే అక్కడికి చేరుకుని, పామును చాకచక్యంగా బంధించారు. అనంతరం ఆ పామును సురక్షిత ప్రాంతంలో విడిచిపెట్టడంతో గ్రామస్తులు ఊపిరి పీల్చుకున్నారు.

## కిర్లంపూడిలో ఘనంగా జనసేన పార్టీ 13 వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు.

- మండలంలోని పారిశుధ్య కార్మికులకు బియ్యం బస్తాల పంపిణీ.






**కిర్లంపూడి, పెన్ పవర్,మార్చి 14**:కాకినాడ జిల్లా మండల కేంద్రమైన కిర్లంపూడి ఏనుగు వీధి సెంటర్‌లో కిర్లంపూడి మండలం జనసేన పార్టీ ఆధ్వర్యంలో జనసేన పార్టీ 13 వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు.స్థానిక జనసేన నాయకులు ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా నిర్వహించిన 13 వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలకు జగ్గంపేట నియోజకవర్గం జనసేన పార్టీ ఇంచార్జ్ తుమ్మలపల్లి రమేష్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా జనసేన పార్టీ జెండాను ఆవిష్కరించి, పార్టీ నాయకులు, కార్యకర్తలకు స్వీట్స్ పంచి ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కిర్లంపూడి మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఒక్కొక్కరికి 25 కిలోల బియ్యం బస్తాలను పంపిణీ చేసారు.

ఈ సందర్భంగా తుమ్మలపల్లి రమేష్ మాట్లాడుతూ, జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని జగ్గంపేట నియోజకవర్గంలోని నాలుగు మండలాల హెడ్‌క్వార్టర్స్‌లో పార్టీ జెండా ఆవిష్కరణ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించామని తెలిపారు.పారిశుధ్య కార్మికులకు,అంగన్వాడీ కార్యకర్తలు, వికలాంగులకు ఒక్కొక్కరికి 25 కిలోల బియ్యం బస్తాలను పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తుమ్మలపల్లి సాయి గుణశేఖర్, జిల్లా సంయుక్త కార్యదర్శి సూరంపాలెం బాలు, గంధం ప్రభాకర్, పాటంశెట్టి రమేష్, అరినే రాజేష్, మండపాక శివ, ముక్కొల్లు శ్రీను, పుర్రే గంగబాబు, కుంచే రాజు, నాగబోయిన శివ, చిక్కాల కల్కిభగవాన్,ఆదారి సతీష్, బొండా నందిబాబు, బొండా రమణ, చిట్టిబోయిన రాంబాబు, దాడి బుజ్జి, యల్లపు దొరబాబు, కాలపురెడ్డి నాని, ఆకుల నవీన్,గుంటముక్కల చిన్న, కాయల మణికంత జగ్గంపేట నియోజకవర్గం జనసేన నాయకులు, జనసైనికులు, పవన్ కళ్యాణ్ అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## జగ్గంపేటలో ఘనంగా జనసేన ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



**జగ్గంపేట, పెన్ పవర్, మార్చి 14:** జగ్గంపేటలో శనివారం జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జగ్గంపేట జనసేన పార్టీ ఇంచార్జ్ తుమ్మలపల్లి రమేష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా జనసేన పార్టీ జెండాను ఆవిష్కరించి, పార్టీ నాయకులు మరియు కార్యకర్తలకు స్వీట్స్ పంచి ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం జగ్గంపేట మండలంలోని ఉన్న దివ్యాంగులకు ఒక్కొక్కరికి 25 కిలోల బియ్యం బస్తాలను అందజేశారు. ఈ సందర్భంగా తుమ్మలపల్లి రమేష్ మాట్లాడుతూ జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని జగ్గంపేట నియోజకవర్గంలోని నాలుగు మండలాల హెడ్‌క్వార్టర్స్‌లో పార్టీ జెండా ఆవిష్కరణ కార్యక్రమాలు నిర్వహించామని తెలిపారు. అలాగే పారిశుధ్య కార్మికులు, అంగన్వాడీ కార్యకర్తలు మరియు వికలాంగులకు, ఆశా కార్యకర్తలు లకు ఒక్కొక్కరికి 25 కిలోల బియ్యం బస్తాలను పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు. అదేవిధంగా జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని భారీ బాణాసంచా పేల్చి ఆనందోత్సాహాల మధ్య వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జగ్గంపేట నియోజకవర్గం జనసేన నాయకులు, జనసైనికులు మరియు అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కార్యకర్తలే తెలుగుదేశం పార్టీకి పునాదులు : వాసంశెట్టి సత్యం



- రామచంద్రపురంలో ఘనంగా టీడీపీ 2, 7, 8 వార్డుల కమిటీల ప్రమాణ స్వీకారం

**రామచంద్రపురం, పెన్ పవర్, మార్చి 14:**రామచంద్రపురం పట్టణంలో తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో 2, 7, 8 వార్డుల అధ్యక్షులు మరియు కమిటీ సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమం శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం, ఏఎంసీ చైర్మన్ అక్కల రిశ్వంత్ రాయ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన వార్డు అధ్యక్షులు మరియు కమిటీ సభ్యులు పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి ప్రజాసేవకు అంకితభావంతో పనిచేస్తామని ప్రమాణ స్వీకారం చేశారు.ఈ కార్యక్రమంలో వాసంశెట్టి సత్యం మాట్లాడుతూ కార్యకర్తలే తెలుగుదేశం పార్టీకి బలమైన పునాదులని అన్నారు.పార్టీబలోపేతానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని సూచించారు. ప్రజల సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేస్తూ పార్టీపై ప్రజల్లో విశ్వాసాన్ని మరింత పెంచాలని పిలుపునిచ్చారు.ఏఎంసీ చైర్మన్ అక్కల రిశ్వంత్ రాయ్ మాట్లాడుతూ కొత్తగా బాధ్యతలు స్వీకరించిన వార్డు అధ్యక్షులు, కమిటీ సభ్యులు ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉండాలని సూచించారు. ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో కీలక పాత్ర పోషించాలని తెలిపారు.అధ్యక్షులు, కార్యదర్శులు వీరే,రెండో వార్డు అధ్యక్షుడు గలింకి సూరిబాబు, కార్యదర్శిగా గల్లిదేవర సుధాకర్ ప్రమాణ స్వీకారం చేశారు. ఏడో వార్డు గణేష్ నగర్ అధ్యక్షుడిగా టేకుమూడి సామ్యూల్, కార్యదర్శిగా మేడిశెట్టి శ్రీ మసేను బాధ్యతలు స్వీకరించారు. 8వ వార్డు గంగమల్లవారి వీధి అధ్యక్షుడిగా చిక్కాల వీరాస్వామి, కార్యదర్శిగా భూపతి సంధ్యారాణి ప్రమాణ స్వీకారం చేశారు.వీరితో పాటు కార్యనిర్వాహక కమిటీ సభ్యులు కూడా బాధ్యతలు స్వీకరించారు.పార్టీ నాయకుల సమక్షంలో కార్యక్రమంఈ కార్యక్రమం పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు ఉండవెల్లి శివ ఆధ్వర్యంలో జరిగింది. క్లస్టర్1 ఇన్‌చార్జి మేడిశెట్టి సూర్యనారాయణ, క్లస్టర్2 ఇన్‌చార్జి కంచుమర్తి బాబురావు సమన్వయం చేశారు.ఈ కార్యక్రమంలో యూనిట్ ఇన్‌చార్జులు పెందుర్తి విజయలక్ష్మి, చింతాకులు ప్రకాష్, ఉపాధ్యక్షులు చందమామ వాసు, కార్యదర్శి కవల నానాజీ, రెండో వార్డు కౌన్సిలర్ సుధీర్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు దిగుమర్తి వీరబాబు, మాజీ కౌన్సిలర్లు గడి గోవిందు,అల్లం శ్రీను,కట్ట నాగేశ్వరరావు, దంగేటి గౌరీ శంకర్,బల్ల శివరామకృష్ణ, గడి జగన్ బ్రహ్మం, మురళి, మనోజ్, వార్డు పెద్దలు గాలికి చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## మణికంఠ కుటుంబనికి అండగా జనసైనికులు



**అల్లవరం, పెన్ పవర్, మార్చి 14:**అల్లవరం మండలం సామంతకుర్రు గ్రామానికి చెందిన కాకిలేటి మణికంత ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో ఆయన కుటుంబాన్ని ఆదుకోవడానికి అమలాపురం నియోజకవర్గానికి చెందిన జనసేన నాయకులు ముందుకు వచ్చారు.జనసేన పార్టీ13వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మణికంత కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సాయం అందించారు. జనసేన పార్టీ ఎలాంటి క్లిష్ట పరిస్థితుల్లోనైనా బాధిత కుటుంబాలకు అండగా ఉండి ఎల్లప్పుడూ ప్రజల పక్షాన నిలిచే పార్టీగా,అన్ని కులాలను ,అన్ని మతాలను సమానంగా గౌరవించడం జనసేన పార్టీ విధానమని అన్నారు.ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు చిక్కం భీమేశ్వరరావు,చిక్కాల సతీష్,గండి స్వామి,పినిశెట్టి సురేష్,దంగేటి శ్రీహరి,అరళ్ళపల్లి దుర్గ ప్రసాద్,చిక్కం బన్ను, గొలకోటి వెంకటేష్,కాకిలేటి హరికృష్ణ,తిక్కా బాబ్జి, మంచం బాబి, పోలిశెట్టి బాలు,పరసా శ్రీను,కాకిలేటి రామలింగేశ్వర రావు,కాకిలేటి శ్రీనివాస్, కాకిలేటి సురేష్, వంగా నాయుడు,నల్లా రాము,కటికిరెడ్డి బాబి, పరసా శివ, మోటూరి వెంకటేశ్వరరావు మరియు గ్రామస్తులు జనసైనికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ర్యాలి కేశవస్వామి ఆలయంలో ప్రత్యేక అలంకరణ



**అన్నదానానికి రూ.10,116 విరాళం**

**ఆత్రేయపురం, పెన్ పవర్ మార్చి 14:**ఆత్రేయపురం మండలం ర్యాలి గ్రామంలో వేంచేసియున్న శ్రీ జగన్మోహిని కేశవస్వామి వారి దేవస్థానంలో శనివారం స్వామివారు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. జగన్మోహిని కేశవ స్వామివారి దర్శనం కోసం భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.ఈ సందర్భంగా నర్సిపూడి గ్రామానికి చెందిన వారణాసి వెంకట రామయ్య శ్రీనివాస్, ధరణి అనుపమ దంపతులు ర్యాలి శ్రీ జగన్మోహిని కేశవస్వామి గోపాలస్వామివారిని ఆలయంలో జరిగే నిత్య అన్నదాన పథకానికి రూ. 10,116లను విరాళంగా సమర్పించారు.దాతలకు ఆలయ అర్చకులు ఖండవల్లి సీతారామాచార్యులు , వేద పండితులు వెంకట అవధాని వేద ఆశీర్వచనం చేయగా ఈవో బి.వెంకటరమణమూర్తి స్వామివారి చిత్ర పటం శేషవస్త్రంతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు, అర్చకులు పాల్గొన్నారు.



## పదో తరగతి విద్యార్థులకు బాసటగా జనసేన

**ఎగ్జామ్ కిట్‌లు పంపిణీ చేసిన పితాని వెంకట రాము**



**కాకినాడ రూరల్, పెన్ పవర్, మార్చి 14:**పరీక్షల సమయంలో విద్యార్థులకు చిన్నపాటి ప్రోత్సాహం అందించినా అది వారిలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొంది స్తుంది.ఈ ఉద్దేశంతో జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించు కుని కాకినాడ రూరల్ మండలంలో విద్యార్థులకు అండగా నిలిచే సేవా కార్యక్రమం నిర్వహించారు.తిమ్మాపురం గ్రామపంచాయతీ పరిధిలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు జనసేన నాయకులు, తూరంగి మాజీ ఎంపీటీసీ పితాని వెంకట రాము పరీక్షా సామగ్రిని పంపిణీ చేశారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు ఎగ్జామ్ ప్యాడ్లు, జామెంట్రీ బాక్సులు, పెన్నులు అందజేశారు.ఈ సందర్భంగా పితాని వెంకట రాము మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ ఆశయాలకు అనుగుణంగా ఈ సేవా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు చెప్పారు.రాబోయే పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులు ఏకాగ్రతతో చదివి మంచి ప్రతిభ కనబరచాలని ఆయన ఆకాంక్షించారు. మంచి మార్కులు సాధించి కాకినాడ రూరల్ ప్రాంతానికి గర్వకారణంగా నిలవాలని సూచించారు.పండుగ వాతావరణంలో జరిగిన ఈ కార్యక్రమం విద్యార్థుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపింది. పరీక్షల సమయంలో ఇలాంటి సహాయం అందడం పట్ల విద్యార్థులు, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

## ఆన్‌లైన్ మోసాలపై వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలి : ఎంపీ తంగెల్ల ఉదయ్ శ్రీనివాస్




**కాకినాడ పెన్ పవర్, మార్చి 14:**వినియోగదారుల రక్షణ చట్టం2019 ద్వారా ఆన్‌లైన్ మోసాలను సమర్థవంతంగా అరికట్టవచ్చని, ఈ విషయంలో వినియోగదారుల సంఘాలు మరింత చురుకుగా పనిచేయాలని కాకినాడ పార్లమెంట్ సభ్యులు తంగెల్ల ఉదయ్ శ్రీనివాస్ పేర్కొన్నారు. అంతర్జాతీయ వినియోగదారుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆయన వినియోగదారులకు శుభాకాంక్షలు తెలిపారు.ఇటీవల పార్లమెంట్‌లో వినియోగదారుల సమస్యలపై ప్రస్తావించి ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లిన ఒదుకు రాష్ట్ర వినియోగదారుల సంఘాల సమాఖ్య ప్రతినిధులు ఎంపీని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భమిడి శివమూర్తి ఎంపీని మర్యాదపూర్వకంగా కలసి వినియోగదారుల ఉద్యమం, సంఘాల కార్యకలాపాలను వివరించారు.ప్రపంచ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా వినియోగదారుల హక్కుల పరిరక్షణకు అందరూ కలిసికట్టుగా పనిచేయాలని ఆయన సూచించారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర వినియోగదారుల సంఘాల సమాఖ్య వైస్ చైర్మన్ కొమ్మూరి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at printed at SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS FLAT NO: 504, Bharat Towers, 5th lane, Dwaraka Nagar, Visakhaptanam, Andhrapradesh-530016, and published at Flat No F2, Nihar towers, Srinagar, kakinada, kakinada District-533003
Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/2017/73154 , editorpenpower@gmail.com

# సముద్రంలోకి తాబేలు పిల్లలు విడుదల.


**కాట్రేనికోన పెన్ పవర్ మార్చి 14:**నీలరేవు,గచ్చకాయలపొ పొర, వాసాలతిప్ప,ఎస్ యానం సముద్ర తీర ప్రాంతంలో సుమారుగా 50 వేలుగుడ్లు సేకరించి ఇంక్యుబేషన్ సెంటర్లో 45 రోజులు భద్రపరచగా తొలి దశలో 300 తాబేలు పిల్లలు జన్మించాయని వాటిని
గచ్చకాయలపొర వద్ద సముద్రంలో విడిచిపెట్టి నట్లు డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ వెల్లడించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సముద్రపు తాబేళ్ల సంరక్షణలో ఇంక్యుబేషన్ సెంటర్ల పాత్ర చాలా కీలకమైనదన్నారు. తీర ప్రాంతాల్లో దొరికిన గుడ్లను సురక్షితంగా పిల్లలుగా మార్చే ప్రక్రియ హ్యాచరీ మేనేజ్‌మెంట్' అటవీ శాఖ విభాగం చేపట్టిందన్నారు.ఈ ప్రక్రియలో ప్రధానంగా ఐదు దశలు ఉంటాయనీ,మొదటిగా గుడ్ల సేకరణ,రవాణా తాబేళ్లు ఇసుకలో గుడ్లు పెట్టి వెళ్ళి పోయిన తర్వాత, కుక్కలు లేదా ఇతర జంతువుల నుండి వాటిని రక్షించడానికి అటవీ శాఖవారు వాటిని సేకరించడం జరిగిందన్నారు,గుడ్లను సేకరించేటప్పుడు వాటిని తిప్పకూడదన్నారు, గుడ్డులోపల ఉండే పిండం దెబ్బతినకుండా,అది ఏ స్థితిలో ఉందో అదే స్థితిలో గంపలు సంచులలో ఉంచి సెంటర్‌కు తరలించడం జరుగుతుందన్నారు.జిల్లా అటవీశాఖ అధికారి ఎమ్ వి ప్రసాద్ రావు మాట్లాడుతూ

కృత్రిమ గూళ్ళ నిర్మాణం

ఇంక్యుబేషన్ సెంటర్‌లో సహజ సిద్ధమైన గూడును పోలి ఉండేలా ఇసుకలో గుంతలు తవ్వడం జరుగుతుందన్నారు,సాధారణంగా 1.5 నుండి 2 అడుగుల లోతులో, పైభాగం ఇరుకుగా మరియు అడుగు భాగం వెడల్పుగా కుండ ఆకారంలో ఉండేలా గూడును సిద్ధం చేయడం జరుగుతుందన్నారు.సేకరించిన గుడ్లను జాగ్రత్తగా ఈ గూడులో ఉంచి,పైన ఇసుకతో కప్పేస్తారన్నారు.ప్రతి గూడుకు ఒక నంబర్ మరియు గుడ్లు పెట్టిన తేదీని గుర్తుగా పెడతారన్నారు,ఇసుక ఉష్ణోగ్రత సుమారు 29 డిగ్రీలు కంటే ఎక్కువగా ఉంటే ఆడ తాబేళ్లు, తక్కువగా ఉంటే మగ తాబేళ్లు పుట్టే అవకాశం ఉంటుందన్నారు. పొదిగే రకాన్ని బట్టి తాబేలు గుడ్లు పిల్లలుగా మారడానికి
సాధారణంగా 45 నుండి 60 రోజులు పడుతుందన్నారు.ఈ సమయంలో గూళ్ల చుట్టూ నెట్లను ఏర్పాటు చేయడం జరుగుతుంది తద్వారా పిల్లలు బయటకు వచ్చినప్పుడు వేరే చోటికి వెళ్లకుండా సురక్షితంగా ఉంటాయన్నారు,సముద్రంలోకి విడుదల చేయడం గుడ్ల నుండి పిల్లలు బయటకు వచ్చిన తర్వాత,వాటిని వెంటనే సముద్రంలోకి వదలడం ఉత్తమన్నారు,సాధారణంగా రాత్రి వేళల్లో లేదా తెల్లవారు జామున వీటిని విడుదల చేస్తారన్నారు, అదే విధంగా తెల్లవారుజామున గచ్చకాయలపొర నందు తాబేలు పిల్లలను విడుదల చేయడం జరిగిందన్నారు,దీని వల్ల పక్షులు లేదా ఎండ వేడి నుండి వాటిని రక్షించవచ్చునన్నారు,పిల్లలను నేరుగా నీటిలో వేయకుండా, తీరానికి కొంచెం దూరంలో ఇసుకపై వదులుతారన్నారు.దీనివల్ల అవి సముద్రం వైపు పాకుతూ వెళ్తాయన్నారు.అవి పెద్ద య్యాక మళ్ళీ అదే తీరానికి వచ్చి గుడ్లు పెట్టడానికి సహాయపడు




తుందన్నారు.ఈ కార్యక్రమంలో తహసిల్దార్ ఓ రవి కిరణ్,డి ఆర్ ఓ సత్యనారాయణ,గ్రామ రెవెన్యూ అధికారులు రాము,సుష్మా అటవీ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




## భక్తజనంతో కిటకిటలాడిన వాడపల్లి క్షేత్రం







**హుండీ ఆదాయం రూ.80 లక్షలు**

**ఆత్రేయపురం, పెన్ పవర్ మార్చి 15:**కోనసీమ తిరుమలగా ప్రసిద్ధి చెందిన వాడపల్లి శ్రీ వెంకటేశ్వర స్వామి క్షేత్రం శనివారం భక్తజనంతో కిటకిటలాడింది. స్వామివారి దర్శనం కోసం కోనసీమతో పాటు సుదూర ప్రాంతాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు.వేకువజామున సుప్రభాత సేవతో ఆలయ కార్యక్రమాలుప్రారంభమయ్యాయి. అనంతరం తొలి హారతి, నీరాజనం, మంత్రపుష్పం, పుణ్యావచనం, కళ్యాణోత్సవం తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులకు స్వామివారి దర్శనం కల్పించగా ఆలయ పరిసరాలు గోవింద నామస్మరణతో మారుమోగాయి.సుదూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తుల కోసం ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడిపింది. దర్శనం అనంతరం భక్తులకు ప్రసాదం పంపిణీ చేసి అన్నదానం నిర్వహించారు.భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ చైర్మన్ ముదునూరి వెంకటరాజు, డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధరరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు. శనివారం స్వామివారి హుండీ ద్వారా సుమారు రూ.80 లక్షల ఆదాయం సమకూరినట్లు ఆలయ అధికారులు తెలిపారు

## వాడపల్లిలో రూ.25 కోట్లతో ఆర్యవైశ్య సేవా నిర్మాణాలకు శంకుస్థాపన

**ఆర్యవైశ్యులు తలచుకుంటే ఏదైనా సాధ్యం: ఎమ్మెల్యే బండారు సత్యానందరావు**





**ఆత్రేయపురం, పెన్ పవర్ మార్చి 14:**ఆర్యవైశ్యులు తలచుకుంటే ఏదైనా సాధ్యమవుతుందని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. కోనసీమ తిరుమలగా ప్రసిద్ధి చెందిన వాడపల్లి క్షేత్రంలో ఆర్యవైశ్య నిత్య అన్నదాన ట్రస్ట్ ఆధ్వర్యంలో రూ.25 కోట్ల వ్యయంతో కళ్యాణమండపం, డార్మిటరీలు, అన్నదాన హాల్, గదుల నిర్మాణానికి శనివారం శంకుస్థాపన చేశారు.

ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే బండారు సత్యానందరావుతో పాటు జనసేన ఇన్‌చార్జ్ బండారు శ్రీనివాస్, అనపర్తి తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జ్ ఆకుల రామకృష్ణ, భాజపా నాయకులు తమలంపూడి రామకృష్ణారెడ్డి, పాలూరి సత్యానందం తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కన్యాకుమారి నుంచి కాశీ వరకు పుణ్యక్షేత్రాల వద్ద ఆర్యవైశ్యులు సేవా కార్యక్రమాల్లో ముందుంటారని కొనియాడారు. వాడపల్లిలో ఆర్యవైశ్య ప్రముఖులు ఏకమై ఇంత పెద్ద సేవా కార్యక్రమానికి శ్రీకారం చుట్టడం అభినందనీయమన్నారు. ఆర్యవైశ్య నిత్య అన్నదాన ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్మించనున్న కళ్యాణమండపం, 700 మంది సామర్థ్యంతో డార్మిటరీ, అన్నదాన హాల్, 90 గదుల నిర్మాణంతో భక్తులకు మరిన్ని సౌకర్యాలు కల్పించబడతాయని తెలిపారు. తిరుమల తరహాలో వాడపల్లి క్షేత్రం అభివృద్ధి చెందుతూ మరో తిరుమలగా భాసిల్లుతుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో భాగస్వామి కావడం తనకు ఎంతో ఆనందంగా ఉందని ఎమ్మెల్యే వ్యాఖ్యానించారు. త్వరలో ప్రభుత్వం తరపున కూడా డార్మిటరీలు, గదుల నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. వచ్చే గోదావరి పుష్కరాల నాటికి ఈ నిర్మాణాలు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆకాంక్షించారు.

వాడపల్లి క్షేత్ర అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని, కేంద్ర ప్రభుత్వ సహకారంతో ప్రసాద్ పథకం కింద కూడా అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య ప్రముఖులు, ఆలయ అధికారులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## 15న అక్షర ఆంధ్ర ఎఫ్‌ఎల్ఎన్ఏటీ ఫైనల్ పరీక్షలు

**జిల్లా వ్యాప్తంగా 1,231 పరీక్ష కేంద్రాల ఏర్పాటు**

**కాకినాడ, పెన్ పవర్, మార్చి 14:**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిధిలో ఈనెల 15న నిర్వహించనున్న అక్షర ఆంధ్ర ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసీ అసెస్‌మెంట్ టెస్ట్ (ఎఫ్ఎల్ఎన్ఏటీ) ఫైనల్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కాకినాడ వయోజన విద్యాశాఖ ఉపసంచాలకులు పసుపులేటి పోశయ్య తెలిపారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు అధికారులు చర్యలు తీసుకున్నట్లు చెప్పారు.మార్చి 15వ తేదీ ఆదివారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ పరీక్షలు నిర్వహించబడతాయని తెలిపారు. అభ్యాసకులు తమకు అనుకూలమైన సమయంలో పరీక్ష రాసుకునే విధంగా ప్రభుత్వం వెసులుబాటు కల్పించిందన్నారు.100 గంటల బోధనతో అభ్యాసకులకు శిక్షణ

జిల్లాలో సెప్టెంబర్ 8 అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవం రోజున తరగతులు ప్రారంభించి వాలంటరీ టీచర్లు అభ్యాసకులకు మొత్తం 100 గంటల బోధన అందించారు. ఇందులో 40 గంటలు పాఠ్య బోధన, 45 గంటలు అభ్యాసన, 15 గంటలు టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ రూపొందించిన ఆర్థిక అక్షరాస్యత, డిజిటల్ అక్షరాస్యత వీడియో పాఠాలు బోధించినట్లు తెలిపారు.1,03,081 మంది అభ్యాసకులు పరీక్షలకు

కాకినాడ జిల్లాలో 2029 నాటికి 3,39,963 మంది నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దే లక్ష్యంతో ప్రభుత్వం కార్యక్రమాలు చేపట్టింది. అందులో భాగంగా 202526 సంవత్సరానికి 1,03,081 మందిని పరీక్షలకు హాజరయ్యేలా ఏర్పాట్లు చేశారు. వీరిలో డీఆర్‌డీఏ ద్వారా 49,945 మంది, డ్వామా ద్వారా 32,959 మంది, మెప్మా ద్వారా 20,177 మంది పరీక్షలకు హాజరుకానున్నారు.


జిల్లా వ్యాప్తంగా మొత్తం 1,231 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయగా, 2,062 మంది ఇన్విజిలేటర్ కమ్ వాల్యుయేటర్లు నియమించారు. రేపు జరిగే పరీక్షలకు సుమారు 33 వేల మంది పురుషులు, 70 వేల మంది మహిళలు హాజరుకానున్నట్లు తెలిపారు. ప్రశ్నపత్రాలను ఇప్పటికే అన్ని కేంద్రాలకు పంపించామని చెప్పారు.పరీక్షల పర్యవేక్షణకు కేంద్ర ప్రతినిధి

పరీక్షల నిర్వహణను పర్యవేక్షించేందుకు కేంద్ర ప్రభుత్వం గగన్ కుమార్ కామత్‌ను పరిశీలన అధికారిగా నియమించినట్లు తెలిపారు.పాస్ మార్కులు ఇలా

ఈ పరీక్షలు మొత్తం 150 మార్కులకు నిర్వహిస్తారు. చదవడం, రాయడం, లెక్కలు అనే మూడు విభాగాల్లో ఒక్కోటి 50 మార్కులు ఉంటాయి. ప్రతి విభాగంలో కనీసం 17 మార్కులు సాధించాలి. మొత్తం 51 మార్కులు వచ్చిన అభ్యాసకులు ఉత్తీర్ణులుగా పరిగణిస్తారు. అవసరమైతే ఐదు గ్రేస్ మార్కులు కూడా కలపబడతాయని తెలిపారు.పరీక్షల్లో 51 మార్కులు రానివారిని 'ఫెయిల్'గా కాకుండా 'నీడ్ టు ఇంప్రూవ్'గా పేర్కొంటామని, అభ్యాసకులను నిరుత్సాహపరచకుండా ప్రోత్సహించే ఉద్దేశంతో ఈ విధానం అమలు చేస్తున్నట్లు తెలిపారు.

పరీక్షల అనంతరం ఇన్విజిలేటర్లు పత్రాలను మూల్యాంకనం చేసి మార్కులను ప్రకటిస్తారు. అనంతరం అవార్డు షీట్లలో నమోదు చేసి వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్ల ద్వారా అక్షర ఆంధ్ర యాప్‌లో అప్లోడ్ చేయాలని ప్రభుత్వం సూచించినట్లు తెలిపారు.

## వృద్ధురాలును ఇంటికి చేర్చిన పోలీసులు



**ఆలమూరు, పెన్ పవర్, మార్చి 14;**మండలంలోని మూలస్థానం అగ్రహంలో మతిస్థిమితం లేకుండా సంచరిస్తున్న నల్లా లీలావతి (64) ఆనే వృద్ధ మహిళను బంధువులకు అప్పగించిన సంఘటన జరిగింది. ఆలమూరు ఎస్సై జి.నరేష్ కథనం ప్రకారం కాట్రేనికోనకు చెందిన లీలావతి శుక్రవారం అర్ధరాత్రి స్థానిక వంతెన సమీపంలో జాతీయ రహదారి పై వాహనాలకు వ్యతిరేక దిశలో సంచరించడంతో స్థానికులు గుర్తించారు. దీంతో వారు 112 నంబరుకు కాల్ చేశారు. దీనిపై స్పందించిన కొత్తపేట సబ్ డివిజనల్ అధికారి సుంకర మురళీ మోహన్ అ భాధ్యతను రాత్రి విధులు నిర్వహిస్తున్న రావులపాలెం రూరల్ సీఐ సీహెచ్ విద్యాసాగర్ కు అప్పగించారు. దీంతో సీఐ విద్యాసాగర్ హుటాహుటీన ఏఎస్సై డివిఎస్ స్వామి, హెచ్‌సి హరికృష్ణ, కానిస్టేబుల్ శేఖర్ తో కలిసి సంఘటన స్థలానికి చేరుకుని ఆమె వివరాలు సేకరించారు. మతిస్థిమితం లేని ఆమె కాట్రేనికోన కు చెందిన రిటైర్డ్ ప్రధాన ఉపాధ్యాయురాలు గా గుర్తించారు. ఆమేరకు ఆమె బంధువులకు సమాచారం పంపించారు. జిల్లా ఎస్పీ రాహుల్ మీనా, కొత్తపేట డిఎస్పీ మురళి మోహన్ ఆదేశాల మేరకు సీఐ విద్యాసాగర్ ఆమెకు కారు ఏర్పాటు చేసి ఆలమూరు పోలీసులు ద్వారా లీలావతిని, ఆమె వద్ద ఉన్న నగదును సురక్షితంగా బంధువుల వద్దకు చేర్చారు. సిఐ విద్యాసాగర్ తీసుకున్న చర్యలకు లీలావతి బంధుమిత్రుల, స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.

## మందపల్లి శ్రీ మందేశ్వర స్వామి దేవస్థానానికి రూ.3.02 లక్షల ఆదాయం





**కొత్తపేట, పెన్ పవర్, మార్చి14;**డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట మండలం మందపల్లి గ్రామంలోని శ్రీ మందేశ్వర స్వామి దేవస్థానంలో శనివారం నిర్వహించిన తైలాభిషేకాలు, ఇతర పూజల ద్వారా మంచి ఆదాయం వచ్చింది. ముఖమండపం, ఏకాదశ రుద్ర తైలాభిషేకం, మహన్యాస పూర్వక తైలాభిషేకం, తిలదానం, స్వయం హోమం వంటి సేవల ద్వారా మొత్తం రూ.1,56,825 ఆదాయం వచ్చింది. పి.ఓ.ఎస్.ద్వారా రూ.6,665, అన్నప్రసాదం విరాళాలు రూ.35,767, పరోక్ష పూజల ద్వారా రూ.1,03,700 అందాయి. మొత్తం రూ.3,02,957 ఆదాయం వచ్చినట్లు సహాయ కమిషనర్,ఈఓ దారపురెడ్డి సురేష్ బాబు తెలిపారు.

# ఘనంగా జనసేన ఆవిర్భావ దినోత్సవం



**ఆలమూరు, పెన్ పవర్, మార్చి 14;**జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవం మండల కేంద్రమైన ఆలమూరులో శనివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక బస్టాండ్ సెంటర్లో ఉన్న జనసేన పార్టీ స్థాపన వద్ద పార్టీ జెండాను మండల పార్టీ అధ్యక్షుడు సూరపురెడ్డి సత్య ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బాణసంచా కాల్చి, పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు ప్రతీ కార్యకర్త నడుచుకుంటున్నారని ఆయన ఆశయాలను మనమందరం ముందుండి నడిపిద్దామని పలువురు నాయకులు సూచించారు. అనంతరం స్థానిక ప్రభుత్వాసుపత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎంసి చైర్ పర్సన్ కొత్తపల్లి వెంకటలక్ష్మి, సర్పంచ్ సంగీత సుభాష్, సొసైటీ అధ్యక్షుడు నల్లా వెంకన్న, సాగునీటి సంఘం అధ్యక్షుడు గారపాటి శ్రీనివాస్ చౌదరి, ఆలయ చైర్మన్ బైరిశెట్టి రాంబాబు, ఎంపీటీసీ పెద్దిరెడ్డి పట్టాభి, కొత్తపల్లి నగేష్, సలాది జెపి, భావన శివశంకర్, చల్లా బాబీ, తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పండు కుటుంబాన్ని పరామర్శించిన ఎస్టీ కమిషన్ సభ్యురాలు సునీత,మాజీ ఎమ్మెల్యే చంటిబాబు,





**గోకవరం పెన్ పవర్ మార్చి 13:-**గుండెపోటుతో మృతి చెందిన గోకవరం ప్రెస్ క్లబ్ అధ్యక్షుడురౌతు పండు కుటుంబాన్ని శనివారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యురాలు గొర్లె సునీత, జగ్గంపేట మాజీ శాసనసభ్యులు జ్యోతుల చంటి బాబు పరామర్శించి కుటుంబసభ్యులకు తన ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు. గోకవరం కరెంట్ ఆఫీస్ సమీపంలో ఉన్న రౌతుపండు ఇంటికి చేరుకున్న మాజీ శాసనసభ్యులు జ్యోతుల చంటిబాబు రౌతు పండు మృతదేహానికి పూలమాలవేసి నివాళు లర్పిస్తూ సంపుతాపాన్ని వ్యక్తం చేశారు అదేవిధంగా పండు కుటుంబానికి తను ఎప్పుడు అండగా ఉంటానని ఆ ధైర్య పడద్దని కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. మృతదేహాన్ని అవయవ దాన నిమిత్తం వైద్య కళాశాలకు ఇవ్వడం పండు యొక్క మానవత్వాన్ని మానవత్వం ఎంత గొప్పదో అని అలాంటి మంచి మనసున్న వ్యక్తి లేకపోవడం బాధాకరమని మాజీ శాసనసభ్యులు చంటిబాబు అన్నారు. కృష్ణుని పాలెం సర్పంచ్ రౌతు ఆదిలక్ష్మి జోగేశ్వరరావు,చక్రవర్తి, మాజీ సర్పంచ్ వై నిరంజని దేవి, గోకవరం మండల వ్యవసాయ సలహా కమిటీ మాజీ సభ్యుడు కసిరెడ్డి సతీష్, మణికంఠ,చక్ర వర్తి,పొదిలి రమణమ్మ పలువురు ప్రముఖులు పండు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

## ఘనంగా జనసేన ఆవిర్భావ దినోత్సవం



**జీలుగుమిల్లి ,పెన్ పవర్, మార్చి 14 ;** ప్రజాసేవే లక్ష్యంగా జనసేన పార్టీని స్థాపించినట్లు పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు అన్నారు. శనివారం జీలుగుమిల్లిలో గడ్డమణుగు కాంప్లెక్స్ నందు జనసేన పార్టీ జెండాని ఆవిష్కరించి, కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. గ్రామస్థాయిలో పార్టీ బలోపేతానికి నాయకులు కార్యకర్తలు కృషి చేయాలని అన్నారు .ఈ కార్యక్రమంలో మండల జనసేన పార్టీ అధ్యక్షులు పసుపులేటి రాము, జీలుగుమిల్లి సొసైటీ అధ్యక్షులు సరిపల్లి సత్యనారాయణ రాజు, నాయకులు సిరి శ్రీను, కోలా మధు, కుంజ రమేష్ ,దాసరి శేషు, పేరా బత్తుల డేవిడ్ రాజు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## అగ్ని ప్రమాదానికి ఇల్లు దగ్ధం




**బాధిత కుటుంబానికి జేకేసీ ట్రస్ట్ అండ**

**కూనవరం,పెన్ పవర్,మార్చి 14.**అగ్ని ప్రమాదానికి మండలంలోని వెంకన్నగూడెం గ్రామానికి చెందిన సోడే అర్జున్ తాటాకు ఇల్లు శుక్రవారం రాత్రి అగ్నికి ఆహుతైంది.మంటలు వేగంగా వ్యాపించడంతో కట్టుబట్టలతో బయటపడ్డారు. కష్టపడి సంపాదించుకున్న ఇంట్లోనే వస్తువులు కాలి బూడిదయ్యాయి. విషయాన్ని తెలుసుకున్న జెకేసి ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ జమాల్ ఖాన్ తక్షణమే స్పందించి బాధిత కుటుంబానికి తక్షణ సహాయంగా నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు.అగ్నికి ఆహుతైన బాధిత కుటుంబానికి అండగా ఉంటామని, ఇంటి పునర్నిర్మాణానికి అవసరమైన సిమెంట్ రేకులు, పైపులను అందజేస్తామని భరోసా ఇచ్చారు.జమాల్ ఖాన్ మాట్లాడుతూ సాటి మనిషి ఆపదలో ఉన్నప్పుడు ఆదుకోవడమే మానవత్వమని అన్నారు.గ్రామస్తులు జమాల్ ఖాన్ చేస్తున్న సేవలను కొనియాడారు.ఈ కార్యక్రమంలో పోడియం అప్పారావు,సల్మాన్ రాజు,కుంజా అనిల్ తదితరులు పాల్గొన్నారు.

## ఆహార మెనూ పటిష్ఠంగా అమలు చేయాలి



**ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి**

**రంపచోడవరం, పెన్ పవర్, మార్చి 14:** ప్రభుత్వ ఆదేశాల ప్రకారం విద్యార్థులకు అందించే ఆహారంలో ఎలాంటి రాజీ ఉండదని రంపచోడవరం ఎమ్మెల్యే, రాష్ట్ర ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్‌పర్సన్ మిరియాల శిరీషాదేవి అన్నారు.రంపచోడవరం మండలం నల్లగొండ ఆశ్రమ బాలికల పాఠశాలను శనివారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అందించే ఆహార పదార్థాలు ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం తప్పనిసరిగా అమలు చేయాలని అధికారులకు ఆదేశించారు.వంటగదిని క్షుణ్ణంగా పరిశీలించిన ఎమ్మెల్యే పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. పాఠశాలలో నిర్వహిస్తున్న పలు రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థుల విద్యా బోధనలో కూడా పూర్తి పర్యవేక్షణ ఉండాలని, ఉత్తీర్ణత శాతం పెంపుపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.విద్యార్థులు, పాఠశాల సిబ్బందికి ఎలాంటి ఇబ్బందులు ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని తెలిపారు. ఆశ్రమ విద్యా వ్యవస్థపై ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా వ్యవహరిస్తోందని పేర్కొన్నారు.గుత్తేదారులు సకాలంలో కూరగాయలు, గుడ్లు, చికెన్ సరఫరా చేస్తున్నారా లేదా అని ఆరా తీశారు. కాలం చెల్లిన ఆహార పదార్థాలు వాడకూడదని హెచ్చరించారు. నాణ్యతలేని సరుకులు సరఫరా చేస్తే గుత్తేదారుల నుంచి స్వీకరించవద్దని స్పష్టం చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే విద్యార్థులతో కలిసి భోజనం చేసి ఆహార నాణ్యతపై సంతృప్తి వ్యక్తం చేశారు. అధికారులు, ప్రజాప్రతినిధులు తనిఖీల సమయంలో మాత్రమే కాకుండా ఎల్లప్పుడూ పారదర్శకంగా వ్యవహరించాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎల్. మల్లమ్మ, వార్డెన్ ఎల్. సౌజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## మత్తు పదార్థాల దుర్వినియోగంపై ఆదిత్య డిగ్రీ విద్యా సంస్థల విద్యార్థులు ర్యాలీ




**రాజమహేంద్రవరం, పెన్ పవర్, మార్చి 14 :**ఆదిత్య డిగ్రీ కళాశాల ఆదిత్య డిగ్రీ కళాశాల ఫర్ ఉమెన్‌కు చెందిన ఎన్ ఎస్ ఎస్ యువజన రెడ్ క్రాస్ వాలంటీర్లు మత్తు పదార్థాల దుర్వినియోగంపై అవగాహన ర్యాలీ నిర్వహిం చారు. ఈ ర్యాలీ ఆర్ టి సి బస్ కాంప్లెక్స్, వి.ఎల్. పురం తిలక్ రోడ్ ప్రాంతాల మీదుగా సాగింది. ఈ ర్యాలీని ఆదిత్య డిగ్రీ కళాశాల ఫర్ ఉమెన్ ప్రిన్సిపాల్ ఎస్ ఎన్ రెహ్మాన్ ప్రారంభించారు. కే. సుధాకర్ పట్నాయక్,
ఎన్ ఎస్ ఎస్ టీమ్ లీడర్లు శ్రావణి, జాహ్నవి, సమీర, నమ్రత విజయవంతంగా నిర్వహించ డంలో సహకరించారు. ర్యాలీ సందర్భంగా వాలంటీర్లు “డ్రగ్స్ లేకుండా స్వేచ్ఛగా జీవించండి”, “మిమ్మల్ని మీరు ప్రేమించండి డ్రగ్స్‌కు నో చెప్పండి”, “డ్రగ్స్‌కు నో చెప్పండి జీవితానికి అవును చెప్పండి” వంటి నినాదాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మహిళా రక్షక్ టీమ్, శక్తి టీమ్ మహిళా పోలీస్ స్టేషన్ సిబ్బంది కూడా పాల్గొని తమ మద్దతు తెలిపారు. అదే విధంగా ఎన్ ఎస్ ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డా. జి.వి.ఎస్. నాగేశ్వరరావు, పొలుకొండ సాయి, డా. బి.హెచ్.వి. రామాదేవి, బి. విమల ఏ పి ఓ బి. కిరణ్ ర్యాలీలో పాల్గొని వాలంటీర్లను ప్రోత్సహించారు.

## ఘనంగా టిడిపి మండల అధ్యక్షులు గెడ్డం తిమ్మారావు పుట్టినరోజు వేడుకలు



**సీతానగరం, పెన్ పవర్, మార్చి 14:**టిడిపి మండల అధ్యక్షులు , గెడ్డం తిమ్మారావుజన్మదిన వేడుకలు శనివారం అభిమానులు, నాయకులు, కార్యకర్తల సమక్షంలో అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న పలువురు నాయకులు, కార్యకర్తలు తిమ్మారావుకు పూలమాలలు వేసి జ్ఞాపికలు అందజేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ మండల అధ్యక్షులు తిమ్మారావు పార్టీలో చురుకైన పాత్ర పోషిస్తున్నారని, అటువంటి వ్యక్తి పుట్టినరోజు వేడుకలకు రావడం చాలా ఆనందంగా ఉందని, ఆయనకు పార్టీలో మరిన్ని పదవులు రావాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన పుట్టినరోజుకి విచ్చేసిన అందరికీ రుణపడి ఉంటానని అన్నారు. కార్యక్రమంలో గద్దె వెంకటకృష్ణ చౌదరి (నళిని), సింగవరం సర్పంచ్ సంగన చిన పోసియ్య, ఓబులేనేని కృష్ణ చైతన్య, సోషల్ మీడియా కన్వీనర్ పుక్కాల శ్రీనివాస్, మునికూడలిసొసైటీ చైర్మన్ సానిపల్లి వెంకట రామారావు, యలమాటి రామకృష్ణ, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీ సంఖ్యలో పాల్గొని తిమ్మారావుకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.ద

## అడ్డతీగల లోఘనంగా ‘జనసేన‘పార్టీఆవిర్భావ వేడుకలు..



**అడ్డతీగల, పెన్ పవర్, మర్చి14:** మండల కేంద్రమైన అడ్డతీగలలో నియోజవర్గ నాయకులు, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రోగ్రామ్ కమిటీ మెంబర్ తాటికొండ. రాజేంద్ర ఆధ్వర్యంలో జనసేన ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మొదటగా పార్టీ జెండా ఎగురవేసి అనంతరం కేక్ కటింగ్ చేయడం జరిగింది. జనసేన పార్టీ 12 సంవత్సరాలు పూర్తి చేసుకుని, 13వ సంవత్సరంలో అడుగు పెట్టిన సందర్భంగా ఒకరికొకరు శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. తాటికొండ. రాజేంద్ర మాట్లాడుతూ, పవన్ కళ్యాణ్ పార్టీ స్థాపించిన మొదటిసంవత్సరం జనసైనికుల్లో ఎటువంటి ఉత్సాహం అయితే ఉన్నదో, ఈ 13 సంవత్సరాలు కూడా అంతే ఉత్సాహంతో ప్రతీ జనసైనికుడు పనిచేస్తున్నారు, అంటే దానికి కారణం కేవలం పవన్ కళ్యాణ్ మాత్రమే సామాన్య ప్రజల కష్టాలను తీర్చగలరనే నమ్మకం అని, ఇలాంటి నాయకత్వం మరే నాయకుడికి ఉండదని, అలానే ఈసారి పార్టీ ఆవిర్భావ దినోత్సవం పల్లె ప్రజల మధ్యన జరుపుకోవాలని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ గిరిజన గ్రామాలలో పర్యటించడం, నిజంగా చాలా అభినందనీయమని, ఆయన ఆశయాలకు అనుగుణంగా రంపచోడవరం నియోజకవర్గంలో అన్ని మండలాలలో జెండా ఆవిష్కరణ జరుపుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఉమ్మడి ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా లీగల్ సెల్ ఉపాధ్యక్షులు కాకి. స్వామి మరియు నియోజకవర్గ వీర మహిళలు పాతర సీతామాలక్ష్మి, భూముల విశాలాక్షి, గోగురబోయిన.అరుణ, పండా. వరలక్ష్మి, వై .వరలక్ష్మి నియోజవర్గ ముఖ్య నాయకులు కుంజ. సిద్దు,రాగల. సురేష్, గుర్రం. సాయి, ముత్యాల. సురేష్, ముత్యాల. చిన్న రెడ్డి, కర్ర. నరసయ్య, బాబి, ప్రభాకర్, వీరబాబు, సాయి, గోపి. శ్రీను అదిక సంఖ్యలో జనసేన నాయకులు,జనసైనికులు పాల్గొన్నారు.

## విద్యార్థులు చదువుతోపాటు ఆటపాటల్లోనూ రాణిస్తుండటం అభినందనీయం

**ఏపీ నిట్ డీన్ స్టూడెంట్స్ వెల్ఫేర్ డాక్టర్ హిమబిందు**

**తాడేపల్లిగూడెం. పెన్ పవర్. మార్చి 14:**విద్యార్థులు చదువుతోపాటు ఆటపాటల్లోనూ రాణిస్తుండటం అభినందనీయమని ఏపీ నిట్ డీన్ స్టూడెంట్స్ వెల్ఫేర్ డాక్టర్ హిమబిందు సూచించారు. నిట్ విద్యా.సంస్థలోని డీన్ స్టూడెంట్స్ వెల్ఫేర్ ఆధ్వర్యంలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న ఉల్కన్ జీ 2క26 కార్యక్రమం శనివారం రాత్రి ముగిసింది. ఈ సందర్భంగా డాక్టర్ హిమబిందు మాట్లాడుతూ విద్యార్థులు తమలోని శక్తియుక్తులను వెలికితీసి, కాలానికి అనుగుణంగా తగిన సాంకేతిక నైపుణ్యాలను అందిపుచ్చుకుంటే ఉన్నత శిఖారాలను అధిరోహించవచ్చన్నారు.
విద్యార్థుల్లో దాగివున్న సృజనాత్మకతను, ప్రతిభా పాటవాలను వెలికితీసేందుకు ఇటువంటి కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయని తెలిపారు. వినూత్న ఆలోచనలు, ప్రాజెక్టులతో ముందుకొచ్చే విద్యార్థులను సంస్థ ఎల్లప్పుడూ ప్రోత్సహిస్తుందని, ఆ దిశగా విద్యార్థులు కృషి చేయాలని వివరించారు. ఈ కార్యక్రమానికి కో ఆర్డినేటర్ గా వ్యవహరించిన అసోసియేట్ డీన్, ఆచార్యులు డాక్టర్ రాజేశ్వర రెడ్డి మాట్లాడుతూ కార్యక్రమాన్ని విజయవంతం చేయటంతోపాటు విశేష సేవలందించిన వాలంటీర్లను ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు వీక్షకులను మైమరిపించాయి. హుషారైన పాటలకు విద్యార్థులు నృత్యాలు చేస్తూ సందడిచేయగా, వేదిక ముందున్న తోటి విద్యార్థులు ఈలలు, కేరింతలు, కేకలు వేస్తూ జోష్ నింపారు. ఈ కార్యక్రమంలో పలువురు డీన్లు, అసోసియేట్ డీన్లు, విభాగాధిపతులు, ఆచార్యులు పాల్గొన్నారు.



